చెత్తదిబ్బను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

పాకెట్ పార్కా చెత్త దిబ్బనా..?

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరం నందలి, పాత బస్తిలోని జుమ్మా మసీద్ ఎదురుగా ఉన్న, పాకెట్ పార్కు ఎటువంటి అభివృద్ధికి నోచుకోవడం లేదని సిపిఎం జిల్లా, నగర, కార్యదర్శులు డి.గౌస్ దేశాయ్, ఎం.రాజశేఖర్ ఘాటుగా విమర్శించారు. కర్నూలు నగరంలోని రెండవ వార్డు పర్యటన గని ఖాన్ అధ్యక్షతన జరిగింది. గౌస్ దేశాయ్, రాజశేఖర్ మాట్లాడుతూ నగరంలో ఎక్కడ చూసినా, చెత్తా రోడ్లన్నీ, వీధులన్నీ చెదారంతో నిండి ఉన్నాయని, కాలువలు పొంగి వీధుల గుండా మురుగు నీరు పొర్లుతున్నాయని వారు ఘాటుగా విమర్శించారు. జుమ్మా మసీద్ ఎదురుగా ఉన్న పాకెట్ పార్కు పరిస్థితి అగమ్య గోచరంగా ఉందన్నారు. ఈపార్క్ దిక్కులేని అనాథగా మారిందన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్, ఇతర అధికారులు చెత్త పన్ను వసూలు చేయడంలో ఉన్నంత శ్రద్ధ, నగర పరిశుభ్రతపై లేకపోవడం విచారకరం అన్నారు. నగర కమిషనర్ స్వచ్ఛ సర్వేక్షణలో రెండవ ర్యాంకు వచ్చిందని, సన్మానాలు, సంబరాలు జరుపుకుంటున్నారని, మంచిదే గాని ఓసారి ఓల్డ్ సిటీని గనక పర్యటిస్తే కమిషనర్‌కు వాస్తవ పరిస్థితి తెలుస్తుందన్నారు. అవార్డు ఇచ్చిన అతను ఎవడో ఆయన ఇక్కడ చూడకుండా అవార్డు ఇచ్చి ఉంటాడన్నారు. అతనికి గుర్రానికి కళ్ళకు గంతలు కట్టి నట్టు ఉందని నగర పాలక సంస్థపై పరోక్షంగా ధ్వజమెత్తారు. కర్నూలు నగరానికి స్వచ్ఛత ఉండాలి అంటే, స్వచ్ఛభారత్ స్వచ్ఛ కర్నూల్ కావాలనుకుంటే, ముందు పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచుకోవాలన్నారు. అప్పుడు నగరం అంత సుందరంగా ఉంటుందని, నగరంలో అన్ని వీధులలో, అన్ని వార్డులలో పరిశుభ్రమం అవుతాయని సలహా ఇచ్చారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండి షరీఫ్, ఇస్మాయిల్, షేక్ అహమ్మద్, అబ్దుల్లా, అబ్దుల్ రహమాన్, వలి, రియాజ్, ఖలీల్ పాల్గొన్నారు.

అంత వరకూ

నీరివ్వలేం...

- డిసెంబర్ 15 వరకే హంద్రీ నీరు
- రబీ సాగు తమ బాధ్యత కాదంటున్న అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

హంద్రీ నీవా ఆయకట్టు రైతులకు డిసెంబరు ఆఖరు తర్వాత నీరు ఇవ్వలేమని అధికారులు తేల్చి చెప్పారు. శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయని, జనవరి నుంచి కాలువలో నీరు పారదని పరివాహక గ్రామాల్లో దండోరా వేయించాలని హెచ్ఎన్ఎస్ఎస్ కర్నూలు డివిజన్-3 ఈఈ వి.సదాశివరెడ్డి తహసీల్దార్లకు లేఖ రాశారు. రబీ సాగు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఒక వేళ సాగు చేస్తే తమ బాధ్యత కాదని వెల్లడించారు..

శ్రీశైలం జలాశయం నీటి మట్టం 875.300 అడుగులకు చేరింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వివిధ సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రోజుకు 3 నుంచి 5 టిఎంసిలు వాడుతున్నాయి. దీంతో రోజు రోజుకూ జలాశయంలో నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. నీటి వినియోగం ఇలాగే కొనసాగితే డిసెంబరు ఆఖరుకు లేదా జవనరి 15నాటికి 798 అడుగులు దిగువకు పడిపోయే అవకాశం ఉంది. జలాశయంలో 810 అడుగుల లెవల్ వరకు మాత్రమే హంద్రీ నీవా, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల నుంచి నీరు ఎత్తిపోసే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో జవనరి తరువాత హంద్రీ నీవా కాలువకు నీరు ఇచ్చే అవకాశమే లేదని పత్తికొండ, దేవనకొండ, గోనెగండ్ల, కృష్ణగిరి, తుగ్గలి మండలాల తహసీల్దారులకు ఇరిగేషన్ అధికారి లేఖ రాశారు. గ్రామ పంచాయతీలు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో ఈ మేరకు నోటీసులు అంటించాలని, దండోరా వేయించాలని ఆ లేఖలో ఆదేశించారు. హంద్రీనీవా ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 11.5 టిఎంసిలే ఎత్తిపోశారు. గత టిడిపి ప్రభుత్వంలో ఐదేళ్లు సగటున 30-35 టిఎంసిల వరకు కృష్ణా జలాలు ఎత్తిపోసి కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని కరువు పల్లెలకు ఫిబ్రవరి, మార్చి ఆఖరు వరకు సాగు, తాగునీరు ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక కూడా 2020లో 40 టిఎంసిలు, 2021లో 28 టిఎంసిలు ఎత్తిపోశారు. కృష్ణగిరి, జూపాడుబంగ్లా, పత్తికొండ, వెల్దుర్తి, కల్లూరు, మద్దికెర మండలాల్లో హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి మోటర్ల ద్వారా ఎత్తిపోతలు, పందికోన జలాశయం పరిధిలో దేవనకొండ, పత్తికొండ మండలాల్లో దాదాపుగా 35 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగులో ఉన్నాయి. రబీ ఆశతో నెల నెలన్నర రోజుల క్రితమే వేరుశనగ, పత్తి, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేశారు. ఎకరాకు సరాసరి రూ.25-రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టారు. గత నాలుగైదు ఏళ్లుగా మార్చి, ఏప్రిల్ ఆఖరు వరకు సాగునీరు ఇవ్వడంతో ఈ ఏడాది కూడా మార్చి ఆఖరు వరకు సాగునీరు అందుతుందని రైతులు అప్పు చేసి పంటలు వేశారు. పంటలు చేతికొచ్చే కీలక సమయం జనవరి నుంచి నీళ్లు ఇవ్వలేమని హంద్రీనీవా ప్రాజెక్టు అధికారులు చేతులు ఎత్తేశారు. ఇదే జరిగితే రూ.350 కోట్ల పెట్టుబడులు మట్టిపాలేనని రైతులు ఆవేదన చెందుతున్నారు.

హంద్రీనీవా నుంచి దిగువకు వస్తున్న నీరు (ఫైల్)

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

- కొత్త పిఆర్‌సి వల్ల ఒరిగిందేమీ లేదు - సిపిఎస్ రద్దు కోసం డిసెంబర్‌లో చలో ఢిల్లీ
- యుటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

తమ ప్రభుత్వం ఫ్రెండ్లీ ప్రభుత్వం అంటూ ఒకవైపు బూటకపు ప్రచారం చేసుకుంటూ మరోవైపున ఉద్యోగులకు ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయడం లేదని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ విమర్శించారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ డిసెంబర్‌లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. మంగళవారం యుటిఎఫ్ ఉమ్మడి కర్నూలు జిల్లా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాకు కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప, ప్రసాద్ అధ్యక్షత వహించారు. ధర్నానుద్దేశించి రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన పిఆర్‌సి వల్ల ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదన్నారు. పిఆర్‌సిని యుటిఎఫ్‌తో పాటు మరో రెండు ఉపాధ్యాయ సంఘాలు ఒప్పుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే కుట్రపూరితంగా అన్ని సంఘాలు ఒప్పుకున్నాయని ప్రకటించుకుందన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఐఆర్‌ను కూడా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కోత పెట్టడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఉద్యోగులకు ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన న్యాయబద్ధమైన అరియర్స్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించకుండా అలసత్వం వహిస్తుందన్నారు. మరోవైపున సంక్షేమ పథకాలకు మాత్రం పెద్ద ఎత్తున నిధులను ఖర్చు చేస్తుందన్నారు. తమకు సంబంధించిన జిపిఎఫ్ డబ్బుల్ని ప్రభుత్వం పలు పథకాలకు ఖర్చు చేస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు ఇతరత్రా ఆర్థిక పరమైన బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. సిపిఎస్ కొన్ని రాష్ట్రాల్లో రద్దు చేస్తూ ఓపిఎస్ విధానానికి ముందుకు వెళ్లాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సిపిఎస్ స్థానంలో జిపిఎస్ తీసుకువచ్చిందన్నారు. ఈ రెండు విధానాలు ఆమోదయోగ్యమైనవి కావన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈనెల 30న రాష్ట్ర రాజధానిలో కూడా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టబోతున్నామన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శులు జయరాజు, సుధాకర్ మాట్లాడారు. ఈ ధర్నాలో జిల్లా సహా అధ్యక్షుడు రవికుమార్, గౌరవాధ్యక్షుడు మారెప్ప, ఆర్థిక కార్యదర్శి హేమంత్ కుమార్, జిల్లా నాయకులు నవీన్ పాటి, యెహోషువా, గాదలింగ, దావీదు, నరసింహ, లక్ష్మీదేవి, దేవపాల్, వెంకటేష్, నాగలక్ష్మి, భాస్కర్, ఇబ్రహీం, తిమ్మన్న, హనుమంతు, నంద్యాల జిల్లా నాయకులు బాబా ఫక్రుద్దీన్, శాంతి ప్రియ, జనార్దన్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఓర్వకల్లులో కలెక్టర్ సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండలంలో మంగళవారం జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు సుడిగాలి పర్యటన నిర్వహించారు. ముందుగా ఓర్వకల్లు ఎయిర్ పోర్టులో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం ఏర్పాటుకు సంబంధించిన పనులను పరిశీలించారు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాల , కెజిబివి పాఠశాలలో చేపడుతున్న నాడు నేడు పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం మోడల్ స్కూల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిర్ పోర్టులో ఏర్పాటు చేయనున్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. నాడు నేడు పనులను కూడా నిర్దేశించిన గడువులోగా పూర్తి కావాలన్నారు. నాణ్యత ప్రమాణాలతో ఈ పనులను నిర్వహించాలన్నారు. విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం అందించే మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు అయ్యేలా చూడాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె వేణుగోపాల్, తహసీల్దార్ శివప్రసాద్ రెడ్డి, ఎంపిడిఒ శివ నాగ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ గురువయ్య, సమగ్ర శిక్ష ఎఇ విష్ణువర్ధన్ , ప్రిన్సిపల్ జోషి తదితరులు పాల్గొన్నారు.

వేతనాల నిలిపివేత

- ట్రెజరీ శాఖాధికారుల కొర్రి - ఆర్‌యులో రెండు నెలలుగా అందని వేతనాలు
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం - రిజిస్ట్రార్ మధుసూదన్ వర్మ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ విశ్వవిద్యాలయంలో రెండు నెలలుగా బోధన , బోధ నేతర సిబ్బందికి వేతనాలను అందడం లేదు. వారికి వేతనాలు చెల్లింపు ట్రెజరీ అధికారులు కొర్రిపెట్టారు. ఎక్కడ లేని నిబంధనలు తమ విశ్వవిద్యాలయానికి పెట్టడం ఎంతవరకు సమంజసమని వర్సిటీ అధికారులు పేర్కొంటున్నారు. రాయలసీమ యూనివర్సిటీలో పనిచేస్తున్న వారికి అక్టోబర్ సెప్టెంబర్ నెలలకు సంబంధించిన వేతనాలు విడుదల కాలేదన్నారు. వర్సిటీలో మొత్తం 11 మంది ప్రొఫెసర్లు ఉన్నారు. కాంట్రాక్టు కింద దాదాపుగా 41 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్నారు. వీరితో పాటు బోధనేతర సిబ్బంది కింద 97 మంది వర్సిటీలో పనిచేస్తున్నారు. ఇప్పుడు వర్సిటీలో పని చేస్తున్న ప్రొఫెసర్లకు , మినిమం టైం స్కేల్ కింద పనిచేస్తున్న బోధ నేతర సిబ్బందికి వేతనాలు చెల్లింపునకు ట్రెజరీ అధికారులు కొర్రిపెట్టారు. ప్రతినెల వారికి ఎఫ్ఎంఎస్ విధానంలో వేతనాలు చెల్లించేవారు. ఇప్పుడు సెప్టెంబర్, అక్టోబర్ నెలలో సంబంధించి వేతనాలు చెల్లింపునకు అనేక కొర్రీలను ట్రెజరీ అధికారులు పెడుతున్నారు. వర్సిటీలో పనిచేస్తున్న ప్రొఫెసర్ పోస్టులు , బోధనేతర ఉద్యోగుల నియామకాల పైన ట్రెజరీ అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ పోస్టులో నియామకాల్లో ప్రభుత్వం నుండి ఏదైనా పాలన అనుమతులు తీసుకున్నారా అంటూ వర్సిటీ అధికారులను ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి ఈ నియామకాలను వర్సిటీ పాలకమండలి ఆమోదముద్ర తోనే చేసినట్లు ట్రెజరీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వర్సిటీ అనేది స్వతంత్ర వ్యవస్థ అని ట్రెజరీ అధికారులకు నివేదించారు. గతంలో మాదిరి వేతనాలు చెల్లించాలని కోరినప్పటికీ ట్రెజరీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం నుండి పూర్తిస్థాయి అనుమతులు ఉంటేనే వర్సిటీలో ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తామని ట్రెజరీ అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏ విశ్వవిద్యాలయంలో లేనటువంటి నిబంధనలను రాయలసీమ విశ్వవిద్యాలయానికి అంటగట్టడం ఎంతవరకు సమంజసమని, ట్రెజరీ అధికారుల తీరుపై వర్సిటీ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి , జిల్లా ఇన్చార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి జోక్యం చేసుకొని వెంటనే ఈ సమస్యకు పరిష్కారం చూపాలని వర్సిటీ బోధన బోధనేతర సిబ్బంది విన్నవించుకుంటున్నారు.

వెంటనే వేతనాలు చెల్లించాలి

- రిజిస్ట్రార్ మధుసూదన్ వర్మ

యూనివర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బందికి రెండు నెలలుగా నిలిపివేసిన వేతనాలు వెంటనే చెల్లించాలని ట్రెజరీ ఉన్నతాధికారులకు విన్నవించాం. ఇప్పటివరకు వారు లేవనెత్తిన అంశాలకు సంబంధించి పూర్తిస్థాయిలో నివేదించాం. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని ఉన్నతాధికారుల దష్టికి కూడా తీసుకెళ్లాం.

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్, ఎంపిపి, జడ్‌పిటిసి తదితరులు

సంక్షేమానికి వైసిపి పెద్దపీట: ఎమ్మెల్యే సుధాకర్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజా సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేసిందని కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన కర్నూలు మండలం రుద్రవరం గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రతి కుటుంబాన్ని పలకరించారు. స్థానికంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను వారికి తెలియజేశారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం చేయని ఆర్థిక సహకారం, సంక్షేమ ఫలాలను వైసిపి అందించిందన్నారు. పసిపాపల మొదలు పండు ముసలి వరకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఒక్కో కుటుంబానికి మూడేళ్లలో రూ. లక్ష నుంచి రూ. 3 లక్షలకు పైగా లబ్ధి చేకూరిందన్నారు. ప్రభుత్వం అభివృద్ధి పై కూడా దృష్టి సారిస్తోందన్నారు. సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయన విజయాన్ని ప్రతిపక్షాలు అడ్డుకోలేవని, తిరిగి వైసిపినే విజయం సాధిస్తుందని చెప్పారు. కర్నూలు ఎంపిపి దంపతులు డి.వెంకటేశ్వరమ్మ, వాసు, జడ్పిటిసి ప్రసన్నకుమార్, వైస్ ఎంపిపి నెహెమ్యా, పసుపుల వ్యవసాయ సహకార సొసైటీ చైర్మన్ శేషి రెడ్డి , మాజీ కర్నూలు మార్కెట్ యార్డ్ చైర్మన్ మహబూబ్ బాషా, ఎంపిడిఒ భాస్కర్ నాయుడు, ఇఒఆర్‌డి, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి- తుగ్గలి

ప్రజా సమస్యల పరిష్కారమే గడపగడప మన ప్రభుత్వ ధ్యేయమని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. మండలం పరిధిలోని గిరిగెట్ల గ్రామంలో మంగళవారం గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమం వైసిపి మండల కమిటీ అధ్యక్షులు నాగేష్, విష్ణువర్ధన్ రెడ్డి, సోమశేఖర్, రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడమే కాకుండా ఆ గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. సొసైటీ చైర్మన్లు విజయలక్ష్మి, అట్లా గోపాల్ రెడ్డి, వైసిపి నాయకులు రామచంద్రారెడ్డి, జగన్నాథ్ రెడ్డి, రాతన మోహన్ రెడ్డి, తుగ్గలి మోహన్ రెడ్డి, జడ్పిటిసి పులికొండ నాయక్, మాజీ జెడ్పిటిసి నారాయణ నాయక్, కోఆప్షన్ సభ్యులు చాంద్‌బాషా పాల్గొన్నారు.

ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం: సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జెండాను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతున్న విజయ్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఆటో కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి విజయ్ కోరారు. మంగళవారం ఎపి ఆటోట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సిఐటియు ఓల్డ్ సిటి కమిటీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సుంకేశుల రోడ్డు లో ఉన్న స్కంద అపార్ట్మెంట్స్ దగ్గర ఆటో సీనియర్ డ్రైవర్ వెంగళరావు అధ్యక్షతన ఆటో స్టాండ్‌లో జెండావిష్కరణ చేశారు. సిఐటియు ఓల్డ్ సిటీ నగర ప్రధాన కార్యదర్శి విజయ్, ఆటో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి మైమూద్ మాట్లాడుతూ రవాణా రంగం కార్మికుల జీవనోపాధి ప్రమాదంలో ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయన్నారు. వేధింపులు తాళలేక కొందరు ఆత్మహత్య ప్రయత్నం చేసుకో బోయారని, ఫైనాన్స్ వేధింపులపై అధికారులకు తెలియజేసిన పట్టించుకోలేదని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికులను ఏవిధంగానూ ఆదుకో లేకపోయాయన్నారు. ఆటో యూనియన్ ఓల్డ్ సిటీ నగర ఆటో యూనియన్ నాయకులు దూదెకొండ కుమార్, వెంకటస్వామి, త్యాగరాజు, రాము, శ్రీధర్, కుమార్, సురేష్ ఆటో కార్మికులు పాల్గొన్నారు.

నందవరం ఎస్ఐని వెంటనే సస్పెండ్ చేయాలి

ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : బ్రిడ్జి నిర్మాణంలో నష్టపోయిన రైతు రోషన్ జమీర్ కుటుంబాన్ని అక్రమంగా అరెస్టు చేసిన నందవరం ఎస్ఐని తక్షణమే సస్పెండ్ చేయాలని ఎపి రైతు సంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం బ్రిడ్జి నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతు జమీర్ కుటుంబం శాంతియుతంగా నిరసన తెలిపితే వారి కుటుంబాన్ని మహిళలతో సహా ఈడ్చి జీపులో పడేయడాన్ని, రైతు సంఘం జిల్లా నాయకులు దేవపుత్రను ఎల్ఐ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నందవరం ఎస్ఐని తక్షణమే సస్పెండ్ చేయాలని జి.రామకృష్ణ , జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు జిల్లా సహాయ కార్యదర్శి సి.హనుమంతు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలవాల్సిన పోలీస్ అధికారులు కాంట్రాక్టర్ వైపు నిలబడి మహిళలని చూడకుండా అందరినీ బలవంతంగా జీపులో ఎక్కించి తీసుకొని వచ్చి పోలీసు స్టేషన్లో నిర్బంధించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. వెంటనే డిఎస్‌పి ,ఎస్‌పి , జిల్లా కలెక్టర్,సబ్ కలెక్టర్ జోక్యం చేసుకొని సమస్య పరిష్కరించాలన్నారు. లేదంటే ఆ ప్రాంత రైతులను ప్రజాసంఘాలను రాజకీయ పార్టీలను కూడగట్టి తహశీల్దార్ కార్యాలయం ఆదోని సబ్ కలెక్టర్ ఆఫీసు, డిఎస్‌పి కార్యాలయం, కర్నూలు ఎస్‌పి కార్యాలయం, కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

దళితుల సమస్యలపై కెవిపిఎస్ పోరాటం

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు అంటరానితనంపై నేటికీ కెవిపిఎస్ పోరాడుతూనే ఉందని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు అన్నారు. మంగళవారం శ్రీరామ నగర్ భగత్ సింగ్ గ్రంథాలయంలో కెవిపిఎస్ వార్డు జనరల్ బాడీ సమావేశం జరిగింది. కెవిపిఎస్ వార్డ్ సహాయ కార్యదర్శి జి.ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎండి.ఆనంద్‌బాబు, కెవిపిఎస్ ఉద్యోగ సంఘంజిల్లాకార్యదర్శి కె.ఈశ్వరయ్య, న్యూ సిటీ అధ్యక్షులు జి. ఏసు రాజు , కెవిపిఎస్ నగర గౌరవ అధ్యక్షులు ఆర్.నరసింహులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ దళితులపై దాడులు దౌర్జన్యాలు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఈనెల 28,29 తారీకులో కెవిపిఎస్ రాష్ట్రమహాసభలు కర్నూలునగరంలోజరగబోతున్నాయన్నారు. ఈ మహాసభల విజయవంతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం కెవిపిఎస్ వార్డ్ కమిటీని 18 మందితో ఎన్నుకున్నారు. వార్డు అధ్యక్షులుగా వై. జాన్సన్, వార్డు కార్యదర్శిగా పి. బాబురావు, సహాయకార్యదర్శిలుగా జి.ఆంజనేయులు, ఆర్.శ్రీనివాసులు, బి.జయపాల్,విజయుడు జి.అజయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా, ఆర్.మద్దిలేటి, కె.దేవయ్య, కె.కిరణ్ కుమార్, ప్రసాద్, కమిటీ సభ్యులుగా పి.వినోద్ కుమార్, జి.రాజు, కే.ఈశ్వరయ్య, ఏ. ఏసేపు, పి.నాగరాజు, వై. నల్లన్న, యు.వెంకటరమణ లను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు మహాసభల నిర్వహణ కోసం రూ.18 వేల విరాళంగా కార్యదర్శి ఆనంద్ బాబు కు అందజేశారు.

సాఫ్ట్ బాల్ పోటీల లోగో ఆవిష్కరించిన బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్

లోగోను ఆవిష్కరిస్తున్న సిద్దార్థరెడ్డి

ఈనెల 25 నుంచి జగనన్న 35వ జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల లోగోను రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తన నివాసంలో ఆవిష్క రించారు. బైరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర క్రీడా శాఖ తరుపున క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. క్రీడా పోటీలకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నుంచి రావాల్సిన వసతులన్నీ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా శాఖ సిఇఒ రమణ, జిల్లా సాఫ్ట్ బాల్ సంఘం కార్యదర్శి విజయ్ కుమార్, పిఇటి సంఘం నాయకులు జాకీర్ హుస్సేన్, శ్రీనాథ్, తిప్పన్న, శేఖర్, సాఫ్ట్‌బాల్ సంఘం ప్రతినిధులు ఉమా, అయ్యన్నా గౌడ్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పంటల సస్యరక్షణ పద్ధతులను పాటించండి : ఎఒ

ప్రజాశక్తి-సి బెళగల్

పంటల సస్య రక్షణ పద్ధతులను పాటించాలని ఎఒ మల్లేష్ కుమార్ రైతులకు సూచించారు. మంగళ వారం కంభదహాల్‌లో ప్రత్తి, మిరప, శనగ, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మిరప , వేరుశనగలో లద్దెపురుగు, పచ్చపురుగు నివారణకు క్లోరోఫైరీ ఫాస్, క్వినాల్‌ఫాస్‌ను పిచికారీ చేయాలని అన్నారు. అధికారుల సలహాలు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్వర్లు, శశికళ,రైతులు ఉన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

సిఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరం : హఫీస్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ పేద ప్రజల పాలిట వరం వంటిదని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. మంగళవారం రాయల్ ఫంక్షన్ హాలులోని ఎమ్మెల్యే కార్యాలయం లో పేద ప్రజలకు రూ. 33 లక్షల 57వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎంతోమంది పేద ప్రజలతో పాటు అన్ని వర్గాల ప్రజలు రూ.లక్షలాది విలువైన వైద్యాన్ని ఉచితంగా అందుకున్నారని అన్నారు. విలువైన వైద్య సేవలను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. అనేక రకాల జబ్బులకు వైద్య సేవలు అందిస్తున్నారని లెక్కకు మించి రోగాలను వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీలో చేర్చారని అన్నారు. గత ప్రభుత్వంలో అన్ని జబ్బులకు వైద్య సేవలు ఉండేవి కాదని అన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి పేద వర్గాల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకొని అనేక రకాల జబ్బులను పొందుపరచడం హర్షణీయమని అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షులుగా ఎం. నీయజ్ అహమ్మద్

మరో 10 మందితో నూతన కమిటీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నూతన జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షులుగా ఎం.నీయజ్ అహమ్మద్ ను నియమించారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కమిటీ చీఫ్ ఎక్సక్యూటివ్ ఆఫీస్ నుంచి జిల్లా కమిటీనీ నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కర్నూలు జిల్లా అధ్యక్షులుగా ఎం.నీయజ్ అహ్మద్ ఉపాధ్యక్షులు గా ఎ.రియాజ్ అహ్మద్, సెక్రటరీగా సయ్యద్ దాదా బాషా ఖాద్రిఖాద్రిని నియమించింది. కమిటీ సభ్యులుగా టిఎండి ఫిరోజ్, అబ్రార్‌బాషా, కొగితాతోట జాకీర్, టి. మొహమ్మద్ హుస్సేన్, సయ్యద్ అమానుల్లాహ్‌బాష, ఎస్‌కె. అబ్దుల్ జిలాని, సయ్యద్ షా హుస్సేన్ ఖాదిరి, హఫీజ్ మొహమ్మద్ ఇలియాస్ ను నియమిస్తూ చీఫ్ ఎక్సక్యూటివ్ ఆఫీసర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాక్ఫ్ బోర్డు ప్రకటన విడుదల చేసింది.

నిబంధనల ప్రకారం గ్రామ కంఠాల రీసర్వే

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - ఆదోని

నిబంధనల ప్రకారం గ్రామ కంఠాల రీ సర్వే పనులు చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గోల్డెన్ జూబ్లీ హాలులో మండల రెవెన్యూ అధికారులు, ఎంపిడిఒలు, ఇఒఆర్‌డిలు, మండల సర్వేయర్లు, విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ కంఠానికి సంబంధించిన రీ సర్వే పనులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద చేపడుతున్న గ్రామ కంఠాల రీ సర్వే పనుల్లో ఎలాంటి తప్పులకూ ఆస్కారం లేకుండా జరగాలన్నారు. దీనిపై గ్రామాల్లో ప్రచారం చేయాలని, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా నోటీసులు అట్టించాలని తెలిపారు. సున్నంతో మార్కింగ్ వేసే ఒకరోజు ముందు ముళ్లపొదలు తొలగించాలని, రెండురోజుల తర్వాత డ్రోన్ ఫ్లయింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ రోజు చేసిన పనులను ఆ రోజే సాఫ్ట్‌వేర్‌లో మ్యాపింగ్ చేసుకోవాలని తెలిపారు. రికార్డులను కూడా సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సర్వే చేసే వారం రోజుల ముందుగానే సంబంధిత యజమానికి నోటీసు ఇవ్వాలని తెలిపారు. సర్వే సమయంలో ఇంటి యజమానులు ఉండేలా చూడాలని చెప్పారు. సర్వే పూర్తి చేసిన తర్వాత 9(2) నోటీసులు యజమానులకు ఇవ్వాలని తెలిపారు. డిఎల్‌పిఒ నూర్జహాన్ పాల్గొన్నారు.

ఘనంగా గుమ్మనూరు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-ఆలూరు

పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడు, దేవరగట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ... నియోజకవర్గంలో తమ కుటుంబంపై చూపుతున్న ఆదరణ, అభిమానాలు ఎన్నటికీ మరువలేమన్నారు. టిడిపి, ఇతర పార్టీలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా వైసిపికి ఆదరణ తగ్గలేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపు కోసం కలిసి కట్టుగా కృషి చేయాలని కోరారు. వైసిపి ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణ స్వామి, జడ్‌పిటిసిలు ఏరూర్ శేఖర్, కిట్టు, మాజీ జడ్‌పిటిసి రాంభీమ్‌నాయుడు, ఎంపిపి శ్రీరాములు, జూటూరు మారయ్య, వైసిపి నాయకులు అరికేర వెంకటేశ్వర్లు, చిన్న ఈరన్న, మండల కన్వీనర్ వీరేశ్, కో ఆప్షన్ సభ్యులు బాషా, దేవనకొండ లుమాంబ, నాయకులు వీరాంజి, మంజు, దీపక్ పాల్గొన్నారు.

సకాలంలో సచివాలయాలకు చేరుకోవాలి

- ఇఒఆర్‌డి సంజన్న

ప్రజాశక్తి - చిప్పగిరి

చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇఒఆర్‌డి సంజన్న

సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రతి అధికారీ సకాలంలో చేరుకోవాలని ఇఒఆర్‌డి సంజన్న సూచించారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శి సిసింద్రీ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది పనితీరు, అటెండెన్స్, మూవ్‌మెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం చెత్త సంపద కేంద్రంలో తడి, పొడి చెత్తను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరిసరాలకు ప్రాధాన్యత ఇచ్చి ఎప్పటికప్పుడు ప్రతి వీధి పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. మహిళలకు పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన పెంచాలన్నారు. సచివాలయ సిబ్బందికి వాలంటీర్లు అందుబాటులో ఉండి సమాచారం అందించాలని తెలిపారు.

విద్యుదాఘాతంతో ట్రాక్టర్ గడ్డి దగ్ధం

ప్రజాశక్తి - కౌతాళం

దగ్ధమవుతున్న ట్రాక్టర్ గడ్డి

విద్యుదాఘాతానికి గురై ట్రాక్టర్ గడ్డి దగ్ధమైన సంఘటన మండలంలోని పొదలకుంట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు మగతి ఈరన్న పొలం నుంచి గడ్డిని తెచ్చేందుకు రంగస్వామికి చెందిన ట్రాక్టర్‌ను తీసుకెళ్లారు. పొలం నుంచి గడ్డిని తీసుకొస్తుండగా గ్రామంలో విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. డ్రైవర్‌తో పాటు అక్కడున్న వారు అప్రమత్తమై ట్రాక్టర్ ఇంజిన్‌ను ట్రాలీ నుంచి వేరు చేశారు. ట్రాలీతో పాటు గడ్డి మంటల్లో చిక్కుకుని కాలిబూడిదయ్యాయి. గ్రామంలో విద్యుత్ తీగల సమస్య గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు.

నకి'లీలు'...

- **ఆర్థిక లబ్ధి పొందేందుకు నకిలీ విత్తనాలను అంటగడుతున్న వైనం**
- **రామదుర్గంలో దాదాపు 100 ఎకరాల్లో పంట నష్టం**

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రతేడాది నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతూనే ఉన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఈ ఏడాది చిప్పగిరి మండలంలో నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోయారు. ఒక్క రామదుర్గం గ్రామంలోనే దాదాపు 100 ఎకరాల్లో రైతులు పంటను నష్టపోయారు.

దిగుబడి సరిగ్గా రాని పత్తి పంట

చిప్పగిరిలోని ఫర్టిలైజర్ షాపు

చిప్పగిరి మండలంలోని ప్రతి గ్రామంలోనూ నకిలీ పత్తి విత్తనాలు వేసి దాదాపు 200 మంది రైతులు నష్టపోయారు. రామదుర్గం గ్రామంలో 100 ఎకరాల్లో నకిలీ పత్తి విత్తనాలు సాగు చేసి రైతులు నష్టపోయారు. అధికారులు, రైతు సంఘం నాయకులు పరిశీలించగా పూత, కాయ లేకుండానే చెట్టు ఏపుగా పెరిగిందని రామదుర్గం రైతులు ఉప్పర రంగన్న, గొల్ల గోపాల్, బొంబాయి నరసన్న, బాలస్వామితోపాటు అనేకమంది రైతులు వాపోయారు. పొలాలకు అధికారులను, రైతు సంఘం నాయకులను తీసుకెళ్లి చూపించారు. వ్యాపారులు లాభం పొందేందుకు రైతులకు మాయమాటలు చెప్పి విత్తనాలను అండగడుతున్నారు. 'మా దగ్గర పత్తి విత్తనాలు తీసుకుంటే పంట వచ్చే వరకు మా దగ్గర నీరు, మందులు అప్పు ఇస్తామ'ని మరికొందరు వ్యాపారులు ఆశ చూపుతున్నారు. రైతులను మోసం చేస్తున్న నకిలీ విత్తనాల వ్యాపారులను అధికారులు గానీ, ప్రభుత్వం గానీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పత్తి సాగు చేసి నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి వ్యాపారుల ద్వారా పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. రామదుర్గంలో బిస్మిల్లా ఫర్టిలైజర్ షాపు వారు ఇచ్చిన నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం అందేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు.

8 ఎకరాల్లో పత్తి సాగు వేసి నష్టపోయాను

- బొంబాయి నరసన్న, రైతు, రామదుర్గం

బిస్మిల్లా ఫర్టిలైజర్ షాపులో 8 ఎకరాలకు కావాల్సిన పత్తి విత్తనాలు తీసుకున్నాం. ఇప్పటివరకు చెట్టు ఏపుగా పెరిగింది. పూత, కాయ లేదు. ఇప్పటివరకు పంటకు పదిసార్లు నీళ్ల మందులు కొట్టాం. ఏ ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటివరకు ఎకరాకు దాదాపు రూ.30 వేల వరకు పెట్టుబడి అయింది. షాపు యజమానికి పరిస్థితి చెబితే 'మేమేం చేస్తాం. మాకు ఆలూరులో ఇచ్చారు. మేం మీకు అమ్మాం.' అని రైతులను బుకాయిస్తున్నారు. అధికారులు స్పందించి నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

కొత్త మెనూ అమలు చేయాలి

- ఎంఇఒ ఈరన్న

ప్రజాశక్తి - హాలహర్వి

పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా కొత్త మెనూను పకడ్బందీగా అమలు చేయాలని ఎంఇఒ బి.ఈరన్న తెలిపారు. మంగళవారం మండలంలోని బాపురం గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని మెనూను మరింత మెరుగుపరుస్తూ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షించి, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి నాణ్యత, రుచిగా ఉండేలా చేయాలని నిర్వాహకులను అదేశించారు. కొత్త మెనూ ప్రకారం భోజనాన్ని తయారు చేసి విద్యార్థులకు అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధానోపాధ్యాయులు ఉషా రాణి పాల్గొన్నారు.

బ్రిడ్జి వద్ద ధర్నా చేస్తున్న రోషన్ జమీర్ కుటుంబ సభ్యులు

రైతు జమీర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - నందవరం

బ్రిడ్జి నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతు జమీర్ కుటుంబాన్ని ఆదుకోవాలని రైతుసంఘం నాయకులు కోరారు. మంగళవారం రైతుసంఘం జిల్లా నాయకులు దేవపుత్ర, ఎల్లేష్‌లు విలేకరులతో మాట్లాడారు. వారికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ, న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని రైతు జమీర్ కుటుంబం ఆందోళన చేస్తుంటే మహిళలతో సహా ఈడ్చి జీపులో పడేసి, తమను కూడా అరెస్టు చేసిన ఎస్ఐని సస్పెండ్ చేయాలని కోరారు. తుంగభద్ర నది ప్రవహించడం వల్ల రెండు కార్లు పంటలు పండే భూములు ఉన్నాయని, ఈ భూములకు చాలా విలువ ఉందని తెలిపారు. అలాంటి భూములకు ఎకరాకు కేవలం రూ.3 లక్షల ఇవ్వడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. జమీర్ కుటుంబ సభ్యులు సలీమ్, రోషన్ జమీర్, అబ్దుల్లా, లతీఫ్, మహబూబ్ బాష, జిలాన్ బాష, షాహిన్, సెర్వన్ భాను, నసీం పాల్గొన్నారు.

విలీనం వల్ల అధ్యాపకులకు నష్టం లేకుండా చూడాలి

- ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి

మాట్లాడుతున్న వంటేరు శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియ వల్ల జూనియర్ అధ్యాపకులకు ఎలాంటి నష్టం లేకుండా చూడాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి కోరారు. మంగళవారం గోనెగండ్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. కళాశాల సిబ్బందితో సమస్యలపై చర్చించారు. కళాశాల ప్రిన్సిపల్ పరమేశ్వర రెడ్డి, అధ్యాపకులు సురేష్, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు రాధా కుమారి, మల్లికార్జున పాల్గొన్నారు.

మహా పాదయాత్రను జయప్రదం చేయండి

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ వీరభద్రగౌడ్

ప్రజాశక్తి -ఆలూరు

కర్నూలు జిల్లాలో బుధవారం జరిగే శ్రీశైలం జగద్గురు మహాపాద యాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని మాజీ టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్రగౌడ్ కోరారు. మంగళవారం ఆదోనిలో జగద్గురు మహాపాదయాత్ర గోడపత్రికలను విడుదల చేశారు. మహా పాదయాత్ర నేడు కర్నూలుకు చేరుకుంటున్న శ్రీశైలం పీఠాధిపతి డాక్టర్ చిన్న సిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహా స్వాముల వారి పాదయాత్రలో వీరశైవులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జంగమ అర్చకుల సంఘం అధ్యక్షులు జెఎల్‌బి శాస్త్రి, సెక్రటరీ బసవరాజు, జాయింట్ సెక్రటరీ చంద్రశేఖర్, రాజశేఖర్ స్వామి, భీమలింగేశ్వర స్వామి దేవాలయ అర్చకులు మల్లికార్జున స్వామి, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

గోడపత్రికలను విడుదల చేస్తున్న నాయకులు

మహారాజ శ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
CUM - MOBILE కోర్టు జడ్జి గారి కోర్టులో
O.S. No.764/2020
కెనరా బ్యాంక్ / సిండికేట్ బ్యాంకు, Rep by its చీఫ్ మేనేజర్, బుధవార పేట బ్రాంచ్, కర్నూలు. ...వాది
-Vs-
C.రంగన్న తండ్రి చంద్రన్న, ఆటో డ్రైవర్, ఇంటి నెం. 45/24K, 28 F4, శ్రీ క్రిష్ణా కాలని, కర్నూలు, కర్నూలు జిల్లా. ...ప్రతివాది
ప్రతివాదికి దావా సమన్సు
పై నంబరు దావాలో వాది ప్రతివాది నుండి దావా మొత్తము రూ. 62,749/- లు, ఇందుపై ముందు వడ్డీ కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 21-12-2022 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
తేది : 21-12-2022
B. నరసింహులు,
వాది పరం న్యాయవాది,
కర్నూలు.

రైళ్లలో తనిఖీలు ముమ్మరం

- రైల్వే డీఎస్పీ అబ్దుల్ అజీజ్

ప్రజాశక్తి - ఆదోని

రైళ్లల్లో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు తనిఖీలు ముమ్మరం చేస్తామని గుంతకల్లు రైల్వే డివిజన్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు. మంగళవారం ఆదోని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైళ్లలో జరుగుతున్న చోరీలు, వస్తువుల తస్కరణలు అరికట్టేందుకు ఆర్‌పిఎఫ్‌ల సహకారంతో తనిఖీలు నిర్వహించి ప్రయాణికులకు భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. డోన్ పరిధిలోని కొండపేట, చిగురుమానుపేట ప్రాంతాల్లో కొందరు రైళ్లలో చోరీలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉందన్నారు. అలాంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామన్నారు. పాత నేరస్తుల ఫొటోలను బహిర్గతం చేసి ప్రయాణికులను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల నిఘా పెంచామని చెప్పారు. రైళ్లలో జరిగిన చోరీల రికవరీలో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. కర్ణాటక నుంచి మద్యం కొనుగోలు చేసి ఆదోనికి తరలిస్తుండగా పెద్ద బసవరాజు, భూంపల్లి నాగరాజు వద్ద నుంచి ఆరు బాక్సుల టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మద్యం విలువ రూ.32 వేలు ఉంటుందన్నారు. రైళ్లలో అక్రమంగా పిడిఎఫ్ బియ్యం రవాణా జరుగుతున్నట్లు డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా ప్రత్యేక నిఘా ఉంచి అలాంటి వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రాత్రి వేళలో 4వ ప్లాట్ ఫామ్‌పై పోలీసుల గస్తీ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరగా ఏర్పాటు చేస్తామన్నారు. రైల్వే సిఐ నాగేష్ బాబు, ఎస్ఐ రామస్వామి, ఎఎస్ఐ సాయి ఉన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ

మహారాజ శ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S. No.264/2021
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కె.నాగలాపురం బ్రాంచ్, Rep by its బ్రాంచ్ మేనేజర్. కె.నాగలాపురం. ...వాది
-Vs-
షేక్ నూర్జహాన్ బేగం పోతివారసులు,
షేక్ కరీముల్లా వగైరా. ...ప్రతివాదులు
ప్రతివాదులకు దావా సమన్సు
1. షక్, కరీముల్లా తండ్రి S. ఖాజాహుస్సేన్ లెక్చరర్
2. షక్, మస్తాన్ వలి తండ్రి S. ఖాజాహుస్సేన్
3. వహీదా రహిమాన్ తండ్రి S. ఖాజాహుస్సేన్
అందరు ఇంటి నెం. 1-52-2B, సుందరయ్య నగర్, కోడుమూరు, గ్రామం & మండలం కర్నూలు జిల్లా.
పై నంబరు దావాలో వాది ప్రతివాదుల స్వాదీనం లో ఉండే లేట్ షేక్ నూర్జహాన్ బేగం ఆస్తిపైన దావా మొత్తము రూ. 3,34,945/- లు, ఇందుపై ముందు వడ్డీ కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాదులైన మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 15-12-2022 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
తేది : 15-12-2022
S.షకీల్ అహ్మద్,
వాది పరం న్యాయవాది.
కర్నూలు.

విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్

రాష్ట్రస్థాయిలో ఆర్ట్స్ కళాశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - ఆదోని

ఈనెల 21న ఎపిఎస్ఎసిఎస్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన ఎస్.ఉషా రాణి ప్రతిభ కనబరిచి ఆదోనికే వన్నె తెచ్చారని కళాశాల ప్రిన్సిపల్ పి.మురళీ మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆదోని ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పోటీతత్వం అలవరచుకున్నప్పుడే లక్ష్యాలను సాధించగలరని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థిని ఉషా రాణిని, తర్ఫీదునిచ్చిన అధ్యాపకులను ఆయన అభినందించారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ బాలస్వామి, ఎన్ఎస్ఎస్ అధికారులు జోనాథన్, వెంకట్రామి రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి

ప్రజాశక్తి - నందవరం

నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ మహ్మద్ హనీఫ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. కర్నూలు జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి జె.చంద్ర శేఖర్ 100 మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానం, 600 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానం సాధించినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపకైన విద్యార్థి చంద్రశేఖర్‌కు ప్రధానోపాధ్యాయులు అరుణ, ఉపాధ్యాయులు భోజరాజు, ప్రవీణ్ కుమార్, లచ్చప్ప, రామిరెడ్డి, శాంతిమూర్తి, రంగమ్మ, పాఠశాల సిబ్బంది నాగరాజు, శ్రీదేవి, ధనలక్ష్మి, సిఆర్‌పి ఉరుకుంద అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు'

- వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

ప్రజా సమస్యల పరిష్కారమే 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహిస్తున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. మంగళవారం కోసిగిలోని 2వ సచివాలయ పరిధిలో సర్పంచి ఎస్.అయ్యమ్మ అధ్యక్షతన ఎంపిపి లవకుశ ఈరన్న, మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డితో కలిసి 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. అనంతరం 2, 3, 4, 5, 6వ వార్డులకు తాగునీరు అందించేందుకు లక్ష లీటర్ల సామర్థ్యంతో దాదాపు రూ.12 లక్షలతో నిర్మించిన తాగునీటి సంపును ప్రారంభించారు. అనంతరం సర్పంచి ఎస్.అయ్యమ్మ, ఎంపిపి ఈరన్నలు గజమాలతో ఎమ్మెల్యేను సన్మానించారు. ఎపిఎం సత్యమ్మ, ఎపిడబ్ల్యు మల్లికార్జున రెడ్డి, ఉప సర్పంచి వాణి, మండల సీనియర్ నాయకులు నరసింహులు, మండల కన్వీనర్ బెట్టన్న గౌడ్, ధరణిధర్ రెడ్డి యూత్ ఆదోని అధ్యక్షులు స్వామి, ఆర్లబండ బ్యాంక్ సొసైటీ అధ్యక్షులు మహంతేష్ స్వామి, మాణిక్య రాజ్, హోళగుంద కోసిగయ్య, వక్రాని వెంకటేష్, నాడిగేని నాగరాజు, కోఆప్షన్ సభ్యులు షౌకత్, దొడ్డి నరసన్న, కాంట్రాక్టర్ బసిరెడ్డి, పి.నాగేష్, అగ్గి నరసయ్య, నరసింహులు, వెంకటేష్ పాల్గొన్నారు.

తాగునీటి సంపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కైరుప్పలలో డ్రైయినేజీ కంపు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని కైరుప్పల గ్రాంలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అంగడి వీరేష్ మండిపడ్డారు. మంగళవారం ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో కైరుప్పల గ్రామంలోని మెయిన్ బజార్ ప్రధాన రహదారిపై నిలిచిపోయిన డ్రెయినేజీ మురుగును చూపిస్తూ నిరసన చేపట్టారు. ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్, ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి యువరాజు, సిపిఐ నాయకులు వీరేష్, బద్రి, జయరాజు, ధనుంజయ, భాస్కర్, నవీన్ పాల్గొన్నారు.

నవ బృందావన గడ్డలో వైభవంగా శ్రీపద్మనాభ తీర్థుల ఆరాధన

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు నవ బృందావన గడ్డలో శ్రీపద్మనాభ తీర్థుల ఆరాధనను వైభవంగా నిర్వహించారు. మంగళవారం కర్ణాటక రాష్ట్రంలోని నవ బృందావన (ఆనేగొంది)లో కొలువైన పద్మనాభ తీర్థుల ఆరాధన సందర్భంగా పీఠాధిపతులు నిర్మాల్యం చేశారు. బృందావనానికి పంచామృతాభిషేకం, అభిషేకం, తులసి అర్చన వంటి పూజలు నిర్వహించారు. బృందావనాన్ని వెండి కవచాలతో, పుష్ప హారాలతో అలంకరిచారు.

పేద కుటుంబాల్లో సంక్షేమ వెలుగులు

- ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రభుత్వ పథకాలతో పేద కుటుంబాల్లో సంక్షేమం వెలుగులు నిండుతున్నాయని వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని 8వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం' చేపట్టారు. వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి, డిఇ మనోహర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ కె.దివ్యకళ, పట్టణ అధికార ప్రతినిధి కె.సునీల్ కుమార్, దేవారాజ్, పట్టణ ప్రధాన కార్యదర్శి దొరబాబు, కోశాధికారి తారా రాజశేఖర్, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ యుకె.రాజశేఖర్, కో ఆపరేటివ్ స్టోర్ ఛైర్మన్ షబ్బీర్ అహ్మద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న జగన్‌మోహన్ రెడ్డి

క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగు

- వైసిపి సీనియర్ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి

- నియోజకవర్గస్థాయి సిఎం స్పోర్ట్స్ ప్రైజ్ మనీ టోర్నమెంట్

క్రీడలతో విద్యార్థుల్లో స్నేహ సంబంధాలు మెరుగు పడతాయని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వీవర్స్ కాలనీలోని గ్లోబల్ ఇండస్ స్కూల్‌లో విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ సిఎం స్పోర్ట్స్ ప్రైజ్ మనీ టౌర్నమెంట్‌ను, నియోజకవర్గస్థాయి కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ ఎంపిక సంబరాలకు హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... గల్లీ, గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం జగనన్న స్పోర్ట్స్ క్లబ్ ప్రారంభించారని తెలిపారు. సుధాకర్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ యుకె.రాజశేఖర్, కోఆపరేటివ్ స్టోర్ ఛైర్మన్ షబ్బీర్ అహ్మద్, పీడీ రాజా రామ్మోహన్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

డిడిఒ అధికారాల అమలుకు చర్యలు తీసుకోవాలి

- ఎంటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు అప్పగించిన డిడిఒ అధికారాలను ప్రభుత్వం సత్వరమే అమలు చేయాలని ఎపిఎంటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోని పురపాలక ఉన్నత పాఠశాలలో డిడిఒ బాధ్యతలు చేపట్టిన ప్రధానపాధ్యాయులు మల్లికార్జున, హలీం సిద్ధిక్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి బసవరాజు, దస్తగిరి, కోటన్న, మద్దయ్య, చంద్రశేఖర్ శర్మ, రమేష్ రావు, రంగన్న, నర్సయ్య, బడుగు బసవరాజు, చంద్రమౌళి, నాగేశ్, నాగరాజు, సుధాకర్ ఉన్నారు.

బైజూస్ ఒప్పందం రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున

ప్రజాశక్తి - హోళగుంద

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో కొత్తగా తీసుకొచ్చిన బైజూస్ ఒప్పందాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున కోరారు. మంగళవారం మండలంలోని హెబ్బటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బైజూస్, నూతన విద్యా విధానం వల్ల విద్యారంగాన్ని పూర్తిగా నిరుగారుస్తున్నారని విమర్శించారు. అనంతరం సభ్యత్వ నమోదు చేపట్టి, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఎస్ఎఫ్ఐ పాఠశాల కమిటీ సభ్యులు రాజు, వీరేష్, లక్ష్మీ, అనిత పాల్గొన్నారు.

అభాగ్యులకు చేయూతనివ్వాలి

- లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్

ఆదోని : అభాగ్యులకు మానవతావాదులు చేయూత నివ్వాలని లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్ కోరారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మంగళవారం పట్టణంలోని కార్వాన్ పేటలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున రెండో విడత దుప్పట్ల పంపిణీ చేపట్టామని తెలిపారు. జిల్లా ఛైర్మన్ ప్రసాద్ రావు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ధర్మారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబ ర్ గోవిందరావు, వెంకటేష్ బాబు, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

మహారాజ శ్రీ కర్నూలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S. No. 1247 /2021
M. యశోదమ్మ. ...వాది
-Vs-
సంపంగి. సంజీవప్రసాద్ వగైరా. ...ప్రతివాదులు
1,3, ప్రతివాదులకు దావా సమన్సు
1. సంపంగి. సంజీవప్రసాద్ తండ్రి లేట్ S. సంజీవరాయుడు, ఇంటి నెం.87/420, కమలా నగర్, కర్నూలు.
3.షేక్. షమీర్ తండ్రి మహబూబ్ సాహెబ్, ఇంటి నెం.43/205-C, నరసింగరావు పేట, కర్నూలు.
పై నంబరు దావాలో వాది ప్రతివాదుల పైన ప్లెయింట్ షెడ్యూలు దాఖళ ఆస్తిని భాగ పరీష్కారం కోరుతూ వారి యొక్క భాగమును సపరేటు చేసి స్వాదీనం చేయమని 2) సదరు ఆస్తికి మీన్ ప్రాఫిట్స్ ఇప్పించమని 3) సదరు ఆస్తిపైన వాది ఫైనల్ డిక్రీ చేయమని 4) 22-09-2012 వ తేదిన జరిపిన విక్రయ దస్తావేజు వాదికి వచ్చిప భాగ పరిష్కార ఆస్తి పైన చెల్లదని మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ దావా దాఖలు చేసినది. ఇందులో 1,3 ప్రతివాదులైన అయిన మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 15-12-2022 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూల ముగా తెలియజేడమైనది.
షెడ్యూలు:
కర్నూలు జిల్లా కల్లూరు సబ్ - రిజిస్ట్రేషన్ జిల్లా, కమలా నగర్ 87వ వార్డు కర్నూలు మునిసిపల్ కార్పోరేషన్ సర్వే నెం.728, ఇంటి నెం.87/420 దక్షిణం ప్రక్క ప్లాటు నెం.37, విస్తీరణం 117.61చ.గజాలు
తూర్పు : పబ్లిక్ రోడ్డు
పడమర : ఇంటి నెం.87/420-1, అమీరున్నీసా ఇల్లు
ఉత్తరం : ఇంటి నెం.87/492 కె.స్వామిదాసు ఇల్లు
దక్షిణం : ప్లాటు మరియు ఇల్లు నెం.36
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
తేది : 15-12-2022
C. లోకేశ్వరయ్య,
C. శాంతమూర్తి,
C. పవన్ కుమార్,
వాది పరం న్యాయవాదులు, కర్నూలు.

రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పి రఘువీర్ రెడ్డి

ఫిర్యాదుదారుల పట్ల

మర్యాదగా నడుచుకోవాలి

- జిల్లా ఎస్పి రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి -గడివేముల

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల పోలీస్ సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలని జిల్లా ఎస్పి రఘువీర్ రెడ్డి సూచించారు. మంగళవారం గడివేముల పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా విచ్చేసిన ఎస్పీకి ఎస్ఐ బిటి.వెంకట సుబ్బయ్య సిబ్బందితో గౌరవ వందనం చేశారు. అనంతరం ఎస్పీ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, స్టేషన్ రికార్డ్సును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ స్టేషన్లోని అన్ని రికార్డ్స్ సరిగా ఉంచుకోవాలన్నారు. ఫిర్యాది దారులకు చట్ట పరిధిలో సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలని అదేశించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని చెప్పారు. పిడిఎస్ రైస్, గుట్కా, జూదం, నాటుసారా, అక్రమ మద్యం వంటి చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచి పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. వివిధ రకాల కేసులపై పట్టుబడిన వాహనాలను సంబంధిత అధికారుల అనుమతి తీసుకొని డిస్పోజల్ చేయాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నంద్యాల డిఎస్పి మహేశ్వర్ రెడ్డి, పాణ్యం సిఐ వెంకటేశ్వరరావు, ఎస్పి సిసి ఫయాజ్ బాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంత వరకూ...

నీరివ్వలేం..

- డిసెంబర్ 15 వరకే హంద్రీనీవా నీరు
- రబీ సాగు తమ బాధ్యత కాదంటున్న అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

హంద్రీ నీవా ఆయకట్టు రైతులకు డిసెంబరు ఆఖరు తర్వాత నీరు ఇవ్వలేమని అధికారులు తేల్చి చెప్పారు. శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయని, జనవరి నుంచి కాలువలో నీరు పారదని పరివాహక గ్రామాల్లో దండోరా వేయించాలని హెచ్‌ఎన్ఎస్ఎస్ కర్నూలు డివిజన్-3 ఈఈ వి.సదాశివరెడ్డి తహసీల్దార్లకు లేఖ రాశారు. రబీ సాగు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఒక వేళ సాగు చేస్తే తమ బాధ్యత కాదని వెల్లడించారు..

శ్రీశైలం జలాశయం నీటి మట్టం 875.300 అడుగులకు చేరింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వివిధ సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రోజుకు 3 నుంచి 5 టిఎంసిలు వాడుతున్నాయి. దీంతో రోజు రోజుకూ జలాశయంలో నీటి నిల్వలు

మల్యాల వద్ద హంద్రీనీవా ఎత్తిపోతల పథకం

అడుగంటుతున్నాయి. నీటి వినియోగం ఇలాగే కొనసాగితే డిసెంబరు ఆఖరుకు లేదా జనవరి 15నాటికి 798 అడుగులు దిగువకు పడిపోయే అవకాశం ఉంది. జలాశయంలో 810 అడుగుల లెవల్ వరకు మాత్రమే హంద్రీ నీవా, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల నుంచి నీరు ఎత్తిపోసే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో జనవరి తరువాత హంద్రీ నీవా కాలువకు నీరు ఇచ్చే అవకాశమే లేదని పత్తికొండ, దేవనకొండ, గోనెగండ్ల, కృష్ణగిరి, తుగ్గలి మండలాల తహసీల్దారులకు ఇరిగేషన్ అధికారి లేఖ రాశారు. గ్రామ పంచాయతీలు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో ఈ మేరకు నోటీసులు అంటించాలని, దండోరా వేయించాలని ఆ లేఖలో ఆదేశించారు. హంద్రీనీవా ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 11.5 టిఎంసిలే ఎత్తిపోశారు. గత టిడిపి ప్రభుత్వంలో ఐదేళ్ల సగటున 30-35 టిఎంసిల వరకు కృష్ణా జలాలు ఎత్తిపోసి కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని కరువు పల్లెలకు ఫిబ్రవరి, మార్చి ఆఖరు వరకు సాగు, తాగునీరు ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక కూడా 2020లో 40 టిఎంసిలు, 2021లో 28 టిఎంసిలు ఎత్తిపోశారు. కృష్ణగిరి, జూపాడుబంగ్లా, పత్తికొండ, వెల్దుర్తి, కల్లూరు, మద్దికెర మండలాల్లో హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి మోటర్ల ద్వారా ఎత్తిపోతలు, పందికోన జలాశయం పరిధిలో దేవనకొండ, పత్తికొండ మండలాల్లో దాదాపుగా 35 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగులో ఉన్నాయి. రబీ ఆశతో నెల నెలన్నర రోజుల క్రితమే వేరుశనగ, పత్తి, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేశారు. ఎకరాకు సరాసరి రూ.25-రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టారు. గత నాలుగైదు ఏళ్లుగా మార్చి, ఏప్రిల్ ఆఖరు వరకు సాగునీరు ఇవ్వడంతో ఈ ఏడాది కూడా మార్చి ఆఖరు వరకు సాగునీరు అందుతుందని రైతులు అప్పు చేసి పంటలు వేశారు. పంటలు చేతికొచ్చే కీలక సమయం జనవరి నుంచి నీళ్లు ఇవ్వలేమని హంద్రీనీవా ప్రాజెక్టు అధికారులు చేతులు ఎత్తేశారు. ఇదే జరిగితే రూ.350 కోట్ల పెట్టుబడులు మట్టిపాలేనని రైతులు ఆవేదన చెందుతున్నారు.

గోస్పాడు తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి - గోస్పాడు

గోస్పాడు మండల తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ మజీర్ జిలానీ సామూన్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎంపిడిఒతో మాట్లాడి మండలంలో ఏఏ పనులు జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. మండలంలో జరుగుతున్న జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణం పనులు, మౌలిక వసతులపై అడిగి తెలుసుకున్నారు. నాడు-నేడు కింద ఎంపికైన పాఠశాలల్లో పనులు ఎలా జరుగుతున్నాయని ఎంఇఒను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

మహానందిలో రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ పిడి మిశ్రా మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈయన రాక సందర్భంగా ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి, ప్రసాదం, శేష వస్త్రంతో ఆయనను సత్కరించారు. అనంతరం స్వామివారి జ్ఞాపికను, తీర్థప్రసాదాలు వారికి ఇఒ అందజేశారు.

స్వామి వారికి లక్ష బిల్వార్చన : మహానంది పుణ్యక్షేత్రంలో కార్తీక మాస మాస శివరాత్రి సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ కొమ్మ మహేశ్వర్ రెడ్డిల ఆధ్వర్యంలో నంద్యాల శ్రీ రామకృష్ణ విద్యాసంస్థల అధినేతలైన డా.గడ్డం రామకృష్ణారెడ్డి, విజయకుమారి దంపతుల సహకారంతో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఋత్విక్వరుణ, కంకణధారణ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి మహాన్యాస పూర్వకంగా రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన 25 మంది పండితులతో 121 రుద్రాలతో మహారుద్రాభిషేకం, కలశస్థాపన, ప్రదోష కాలంలో లక్షబిల్వార్చన, చండీహోమం వైభవంగా నిర్వహించారు.

మూడు రోజుల్లో రూ. 35 లక్షలు ఆదాయం : కార్తీక మాసం చివరి మూడు రోజుల్లో మహానందీశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో రూ. 35 లక్షల 84 వేల 917లు ఆదాయం వచ్చినట్లు పరిపాలన విభాగపు పర్యవేక్షకులు ఓ. వెంకటేశ్వరుడు తెలిపారు.

సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ పిడి మిశ్రాకు స్వామి వారి జ్ఞాపికను అందజేస్తున్న ఇఒ కాపు చంద్రశేఖర్ రెడ్డి

రైళ్ల రాకపోకల సంఖ్య పెంచండి

- రైల్వే స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి
- రైల్వే జనరల్ మేనేజర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసి, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా రైళ్ల రాకపోకల సంఖ్యను పెంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌ను కోరారు. మంగళవారం నంద్యాలకు వచ్చిన రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ స్థానిక రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. రైల్వే స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే జిఎంకు సిపిఎం ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రం కావడంతో రైల్వే స్టేషన్ ప్రధాన కేంద్రంగా మారిందని, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైళ్ల సంఖ్య పెంచాలన్నారు. రైల్వే స్టేషన్లో మౌలిక వసతులు కల్పించాలని, దూర ప్రాంతాలకు రైళ్లు వేయాలని, రైల్వే గేటు దగ్గర ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పొన్నాపురం, మూల సాగరం, నూనెపల్లిలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద అండర్ గ్రౌండ్ బ్రిడ్జికు గతంలో కూడా అర్జీలు ఇచ్చామన్నారు. ఈ మూడు ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలు నిర్మించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు. రైల్వే స్టేషన్లో వెయిటింగ్ రూమ్స్ మూతబడి ఉన్నాయని, సెకండ్ క్లాసు, ఫస్ట్ క్లాస్ తరగతుల్లో ప్రయాణించే ప్రయాణికులకు వెయిటింగ్ రూములు లేక ఇబ్బందికరంగా ఉందన్నారు. అలాగే ఎస్కలేటర్, లిఫ్టులు లేకపోవడం, అప్పటికప్పుడు రైళ్ల రాకపోకల ప్లాట్‌ఫామ్‌లు మారడం వల్ల వృద్ధులు, వికలాంగులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాని చెప్పారు. కావున ఎస్కలేటర్, లిఫ్టులను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. నంద్యాల నుండి గుంటూరు వరకు డబ్లింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. నంద్యాల నుంచి విజయవాడకు, విజయవాడ నుంచి నంద్యాలకు వచ్చే ఎక్స్‌ప్రెస్ రైలు నాలుగు గంటల్లో రావాల్సి ఉండగా సింగల్ లైన్ ఉండటం వల్ల 6, 7 గంటలు, కొన్ని సందర్భాల్లో 9, 10 గంటల సమయం పడుతుందన్నారు. దీనిని వెంటనే పరిష్కరించాలని కోరారు. విజయవాడ నుంచి ముంబాయికి రైలు వేయాలని చాలా కాలంగా కోరుతున్న ఆ సమస్య పరిష్కారం కావడం లేదని, తక్షణమే స్పందించి ముంబాయికి రైలు వేయాలని కోరారు. నంద్యాల నుంచి గుంతకల్ వైపునకు ఇతర రవాణా సౌకర్యం దూరం, సమయం పెరగడం, ఉదయం నుంచి 11 వరకు ఎలాంటి ట్రైన్స్ సౌకర్యం లేకపోవడంతో డోన్, బేతంచెర్ల, గుంతకల్లుకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిష్కరించాలని ఎంతోకాలంగా ఈ డిమాండ్ ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.నాగరాజు, పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు, తోట మద్దులు, శ్రీనివాసమూర్తి, సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి.లక్ష్మణ్, కెఎండి.గౌస్ తదితరులు ఉన్నారు.

ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో నాటు సారా తయారీని కట్టడి చేసి వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ ఎక్సైజ్, వివిధ సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సారా తయారు చేసి అమ్ముతూ పట్టుబడి కేసు నమోదు చేసి ఉన్న వారందరికీ కూడా ప్రత్యామ్నాయ జీవనోపాధిని కల్పించాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 164 మంది సారా తయారు చేసి అమ్ముతూ పట్టుబడిన కుటుంబాలను సర్వే చేసి 66 మందికి ప్రత్యామ్నాయ జీవనోపాధిని గుర్తించినట్లు తలెఇపారు. మిగిలిన వారిని కూడా సర్వే చేసి లిక్కర్ తయారు చేయకుండా, అమ్మకుండా ఉండటం కోసం ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించడం కోసం ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు వారి వారి శాఖల నుంచి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఆర్డిఏ- వైకెపి ప్రాజెక్ట్ డైరెక్టర్ వైబి.శ్రీధర్ రెడ్డి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, ఎల్‌డిఎం సత్యనారాయణ , జిల్లా ఉపాధి కల్పన అధికారి పి.సోమశివారెడ్డి, ఐటిడిఏ పిఒ మురళి, బిసి, ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్ ఈడిలు, ఎక్సైజ్ శాఖా అధికారులు, డిఆర్‌డిఏ ఏపిడి శ్రీధర్ రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన

క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న ఎంజివి.రవీంద్రనాథ్

జాతీయ హ్యాండ్ బాల్ పోటీల్లో రాణించాలి

ప్రజాశక్తి - నంద్యాల

జాతీయస్థాయి మహిళా హ్యాండ్ బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు రాణించాలని రవీంద్ర విద్యా సంస్థల అధినేత ఎంజివి.రవీంద్రనాథ్ ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక ఎస్‌డిఆర్ వరల్డ్ స్కూల్లో శిక్షణ పొందుతున్న రాష్ట్ర మహిళా జట్టును ఆయన పరిచయం చేసుకొని మాట్లాడారు. పోటీల్లో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి గెలుపు కోసం ప్రయత్నించాలని ఆయన కోరారు. జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు నంద్యాల ఆతిథ్యం ఇవ్వడం తమ అదృష్టమన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న మహిళా క్రీడాకారుల ఆచార సాంప్రదాయాలను తెలుసుకునే అవకాశం వచ్చిందన్నారు. అనంతరం ఆయన కరచాలనం చేసి క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో పోటీల ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి బి రామాంజనేయులు, కన్వీనర్ నిమ్మకాయల సుధాకర్, స్పోర్ట్స్ అథారిటీ కోఆర్డినేటర్ ఏపి రెడ్డి, ఎస్‌జిఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రమణారెడ్డి, పిఇటిల సంఘం ప్రతినిధి నాగరాజు, జట్టు కోచ్ బడే సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

జననీ మహిళా బ్యాంక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

కోవెలకుంట్ల : జననీ మహిళా బ్యాంక్ ఆధ్వర్యంలో శాంతిరాం మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్యాంకు గౌరవ అధ్యక్షురాలు ఎత్తపు వాణిదేవి, కోశాధికారి హరిప్రియలు ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరంలో డాక్టర్లు గిరి ప్రసాద్, ప్రియాంక ఫారున్, వేణులు పాల్గొని ఆయాసం, ఫిట్స్, ఆర్థోకి సంబంధించి రోగులకు వైద్యం అందించారు. బిపి, షుగరు, ఈసీజీ పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పద్మావతమ్మ, సిఇఒ రమణ, సావిత్రి, రత్నమ్మ, పద్మావతి, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న బ్యాంకు గౌరవ అధ్యక్షురాలు వాణిదేవి

అహోబిలంలో వైభవంగా స్వాతి వేడుకలు

- పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల, యువ హీరో పూరి ఆకాశ్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

అహోబిలం క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు కాలినడకన తరలివచ్చి నవ నారసింహులను దర్శించుకున్నారు. దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించి, అనంతరం స్వామి, అమ్మవార్ల ఎదుట సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, అర్చక బందం వేద మంత్రోచ్చారణల మధ్య స్వాతి సుదర్శన హెూమం నిర్వహించారు. పూర్ణాహుతి ముగియగానే హెూమం నుండి వెలువడిన కాటుకను, సుదర్శన కంకణాలను భక్తులకు అందజేశారు. ఎగువ అహోబిలంలో స్వామి వారిని క్యూలైన్లలో వేచి ఉండి భక్తులు దర్శించుకున్నారు.

నవనారసింహాలను దర్శించుకున్న ఎమ్మెల్యే గంగుల : ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి స్వాతి సందర్భంగా నవ నారసింహులను కాలినడకన వెళ్లి దర్శించుకున్నారు. అలాగే దిగువ అహోబిలంలో స్వాతి సుదర్శన హెూమంలో పాల్గొన్నారు. ఆయన వెంట వైసిపి నాయకులు గంధం రాఘవరెడ్డి ఉన్నారు.

క్షేత్రంలో సినీ హీరో సందడి : . అహోబిలంలో యువ హీరో, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కుమారుడు పూరి ఆకాష్ సందడి చేశారు. పూరి ఆకాష్ ఎగువ, దిగువ అహోబిలాలోని అలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎగువ అహోబిలంలో ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డిని పూరి ఆకాష్ కలిసి కాసేపు ముచ్చటించారు. అలాగే దిగువ అహోబిలంలో స్వాతి సుదర్శన హెూమంలో పాల్గొన్నారు. యువ హీరో ఆకాష్‌ను చూడడానికి పలువురు అభిమానులు ఎగబడ్డారు.

సుదర్శన హెూమంలో పాల్గొన్న యువ హీరో పూరి ఆకాశ్

శాసన సభ్యులు గంగులతో హీరో ఆకాష్ పూరి

మహిళల అభ్యున్నతికి కృషి : ఎమ్మెల్యే శిల్పా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

శిల్ప సేవా సమితి ద్వారా మహిళల అభ్యున్నతికి, వారి కాళ్లపై వారు నిలబడడానికి తమ వంతు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి తెలిపారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని ప్రథమ నందీశ్వర స్వామి దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా పట్టణ మహిళలకు శిల్పా సేవా సమితి ఆధ్వర్యంలో వన భోజనాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని మహిళలు భారీగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్తిక మాసంలో మహిళలకు శిల్ప సేవాసమితి ఆధ్వర్యంలో వనభోజనాలు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కరోనా వల్ల రెండు సంవత్సరాలు ఏర్పాటు చేయలేకపోయమన్నారు. అలాగే మా నాన్న శిల్పా మోహన్ రెడ్డి రాజకీయాల్లోకి రాకమందు నుంచి శిల్ప సేవా సమితి ద్వారా మహిళలకు రుణాలను, పింఛన్లను సొంత డబ్బుతో అందించేవారిని, మహిళల అభ్యున్నతికి, వారి కాళ్లపై వారు నిలబడడానికి తన వంతు సహాయం చేసేవారన్నారు. మహిళల కోసం శిల్పా మహిళ బ్యాంక్, శిల్పా మహిళా సహకార ఏర్పాటు చేశామని, నంద్యాల నియోజకవర్గంలోని మహిళలు మా కుటుంబాన్ని ఆదరిస్తూ వస్తున్నారని, వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా, గెలుపు ఓటములకు సమానంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, శిల్పా కుటుంబాన్ని ఆదరిస్తున్న మహిళలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా బ్యాంకు చైర్ పర్సన్ నాగిని రవి సింగారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, మున్సిపల్ మహిళా కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, శిల్పా నాగిని రవి సింగారెడ్డిలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహిళలు

నంద్యాల-తిరుపతికి రైలు అభినందనీయం

- రైల్వే జిఎంకు ఎంపి పోచా, ఎమ్మెల్యే శిల్పా ప్రత్యేక ధన్యవాదాలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల నుండి తిరుపతికి రైలు రాకపోకలకు అనుమతి ఇవ్వడం అభినందనీయమని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్‌ను పరిశీలించేందుకు వచ్చిన రైల్వే జిఎం అరుణ్ కుమార్ జైన్‌ను ఎంపీ, ఎమ్మెల్యేలు కలిసి పలు సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతికి ట్రైన్ వేసినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి చొరవతో తిరుపతికి ట్రైన్ వేశారని, ప్రతిరోజు తిరుపతికి వెళ్లే ట్రైన్ ప్రజలతో రద్దీగా వెళ్తుందని, ప్రజలు కూడా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. అలాగే తిరుపతిలో దాదాపు 8 గంటల వరకు ఖాళీగా ఉంటుందని, అందువల్ల తిరుపతి నుండి చెన్నై వరకు కొనసాగిస్తే బాగుంటుందని రైల్వే జిఎంను కోరారు. అందుకు జిఎం సానుకూలంగా స్పందించినట్లు శిల్పా తెలిపారు. నంద్యాల పట్టణంలోని మూలసాగరం, నూనెపల్లె, పొన్నాపురం గేట్ల వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గించడం కోసం అండర్ గ్రౌండ్ పనులు అడిగామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

రైల్వే జిఎం అరుణ్ కుమార్ జైన్‌కు పూలబొకే అందజేస్తున్న ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

నూనెపల్లె-రైతునగరం ఓవర్ బ్రిడ్జిపై నూతన రోడ్డు నిర్మాణం

నంద్యాల అర్బన్ : నంద్యాలలోని నూనెపల్లె-రైతు నగరంకు వెళ్లే ఓవర్ బ్రిడ్జిపై అద్వాన స్థితిలో ఉన్న రోడ్డుపై నూతనంగా రోడ్డును నిర్మించేందుకు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి చర్యలు చేపట్టారు. అలాగే సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేసి వాహనదారులకు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా తీర్చిదిద్దారు. దీంతో పట్టణ ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

జంతు హింసను మానండి

సంజామల : ప్రతి ఒక్కరూ జంతు హింసను మానాలని, జంతువులను ప్రేమించాలని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర పిరమిడ్ ధ్యాన మందిరం సభ్యులు తెలిపారు. మంగళవారం సంజామలలో ర్యాలీ నిర్వహించి జంతు హింస చేయరాదని, జంతువులను ప్రేమించాలని ప్రజలకు సూచించారు.

25న మండల సర్వసభ్య సమావేశం

ఆళ్లగడ్డ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 25న శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిషత్ అధ్యక్షులు గజ్జల రాఘవేంద్ర రెడ్డి అధ్యక్షతన మండల సమావేశం జరుగుతుందని, ఆయా శాఖల అధికారులు పూర్తి వివరాలతో హాజరు కావాలన్నారు. జడ్పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, కార్యదర్శులు, అధికారులు తదితరులు హాజరు కావాలని కోరారు.

బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరి : ఎంపిడిఒ

కొలిమిగుండ్ల : మండలంలోని ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలని ఎంపీడీవో సుబ్బరాజు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అన్ని గ్రామాల పంచాయతీ సెక్రటరీలతో బయోమెట్రిక్ అటెండెన్స్, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వే, సచివాలయాల పని తీరు, త్వరలో నిర్వహించే సర్వసభ్య సమావేశంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వర్క్ బిల్స్‌లో రికవరీ చేసిన వాటిని తిరిగి సంభందిత శాఖల వారికి చెల్లించుట, వాలంటీర్స్ నియామకాలు తదితర అంశాలపై ఎంపిడిఒ సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవరెడ్డి వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు, అమరావతి, ఖాశీంసాహెబ్, కృష్ణవేణి, సిందుజ, సుందరమ్మ, రాజశేఖర్ రెడ్డి, పుల్లయ్య, ఫర్వేజ్, బొయాజ్, రవికుమార్, హరికృష్ణ, కవిత, వెల్ఫేర్‌ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్ ఇజ్రాయిల్, ఈశ్వర్ నాయక్‌లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ సుబ్బరాజు

మాట్లాడుతున్న ఏసురత్నం

హక్కుల సాధనకు పోరాటాలు : సిఐటియు

ప్రజాశక్తి - వెలుగోడు

హక్కుల సాధనకు పోరాటాలే సరైన మార్గం అని సిఐటియు జిల్లా అధ్యక్షులు యేసురత్నం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు నాగేంద్రుడు అన్నారు. మంగళవారం అమ్మవారిశాల ఆవరణలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వాలు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న వాగ్దానాన్ని మరిచి ఉన్న 75 లక్షల ఉద్యోగాలు తీసేసిందన్నారు. మరో ఐదు లక్షల చిన్న తరహా పరిశ్రమలు మూతకు బిజెపి ప్రభుత్వం కారణమని అన్నారు. పోరాడి సాధించుకున్న 44 లేబర్ చట్టాలను మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్లు విభజించి యజమానులకు అనుకూలంగా బిజెపి ప్రభుత్వం పరిపాలన కొనసాగుతుందన్నారు. ఈ మహాసభలో వెలుగోడు సిఐటియు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నాగమోహన్, కార్యదర్శిగా టి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా తులసమ్మ, వరాలమ్మ, సహాయ కార్యదర్శిగా మహమ్మద్ రఫీ, రామాంజనేయులుతో కలిపి 15 మందితో నూతన కమిటీని ఎన్నుకోవడం. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాముడు, ఆంజనేయులు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు రమాదేవి ఆశ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సుజాతమ్మ అమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటయ్య, ఎర్ర బాషా, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు జాను, స్వచ్ఛభారత్ కార్మికుల సంఘం నాయకులు వీరాంజనేయులు మాట్లాడారు. మండలంలోని వివిధ కార్మికులు ఈ మహాసభలో పాల్గొన్నారు.

నగర పంచాయతీని ఆదర్శంగా చేస్తా : వైసిపి

బేతంచెర్ల : బేతంచెర్ల నగర పంచాయతీని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సహాయ సహకారాలతో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి అన్నారు. బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోడ్లు, తాగునీటి సౌకర్యాలు, డ్రైనేజ్, వీధిలైట్లు, తదితర సమస్యలన్నిటినీ దశలవారీగా పరిష్కరించడం జరుగుతుందని ఆయన అన్నారు. నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు నాయక్, జూనియర్ అసిస్టెంట్ రాజేష్, ఆఫీస్ సిబ్బంది హుసేని కిరణ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారికి సన్మానం

ప్రజాశక్తి - చాగలమర్రి

మూడు సంవత్సరాల నుండి మండల ప్రభుత్వ వైద్యాధికారిగా సేవలందిస్తున్న నారాయణరెడ్డి హైదరాబాదులో పీజీ కోర్సుకు ఇక్కడ నుంచి వెళ్తున్న సందర్భంగా వైద్యాధికారు అంజలి, ఇమామ్, సిబ్బంది ఘనంగా సన్మానించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన చేసిన వీడ్కోలు సభకు ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపిపి వీరభద్రుడు, రాష్ట్ర వైసిపి మైనారిటీ సెల్ కార్యదర్శి బాబులాల్, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, ఉపసర్పంచ్ సోహెల్, తోడెండ్లపల్లె సర్పంచ్ గోవిందయ్య, తదితరులు డాక్టర్ నారాయణ రెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమం లో వైద్యులు వినయ్ ప్రేమ్‌చంద్,సుల్తానా, శివ చంద్రారెడ్డి, పవన్,హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ,సూపర్వైజర్లు రామలింగారెడ్డి, రామచంద్రుడు, సీతారాముడు,ప్రమీలమ్మ, ఎమ్ఎల్‌హెచ్‌పిలు, స్టాఫ్ నర్సులు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు,ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోను అమలు చేసిన ఘనత వైసిపిదే : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రవిచంద్ర రెడ్డి

గడపగడపకులో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా, చైర్మన్ డాక్టర్ ఆసియా

ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీని, మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను అమలు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం హరిజనవాడలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొని మూడేళ్ళ పాలనలో ప్రతి ఇంటికి అందిన లబ్ది ని ఆరాతీసి ప్రభుత్వ పాలన తీరు ను ప్రజల నుండి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ లబ్ధిని అందించడంలో అవినీతికి అవకాశం లేకుండా నేరుగా బాంక్ లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్ మునయ్య, కన్నమ్మ, ఎర్రన్న, బాబు, శేఖర్, సాయిబాబా, వార్డు వైసిపి నాయకులు తదితరులు టపాల్గొన్నారు.

ఆత్మకూరు : ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న గడప గడప మన ప్రభుత్వ కార్యక్రమం మంగళవారం నాడు 3,4,9 వార్డుల పరిధిలో కొనసాగింది. ఈ కార్యాక్రమానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, చైర్మన్ డాక్టర్ ఆసియా పాల్గొని ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. పట్టణ అభివృద్ధి కోసం మున్సిపల్ అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పెనుకొండ శ్రీనివాసరావు, ఎస్సై కృష్ణమూర్తి, విద్యుత్ శాఖ ఏఈ రమేష్ బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ మూల రాజగోపాల్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎం.ఏ .రషీద్, వార్డు కౌన్సిలర్లు సుల్తాన్, యూనిస్, షేక్షావలి, షఫీ ఉల్లా, హరిప్రసాద్, ప్రకాష్, రంగస్వామి, పార్వతి, శంషుర్, మాజీ వార్డు కౌన్సిలర్ తిమోతి బోర్వెల్, రహిమాన్, శాలి పైల్వాన్, షాకీర్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు భూ పంపిణీ చేయాలి : వ్యకాసం

ప్రజాశక్తి - ఆత్మకూర్

నిరుపేదలకు భూ పంపిణీ చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నాగేశ్వరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆత్మకూరు సుదర్శన్ వర్మ భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల రెండో మహాసభలు నరసింహ నాయక్ అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ స్వతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాల అవుతున్న 50 శాతం మందికి నేటికీ భూమిలేదని, రెక్కల కష్టం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, అలాంటి వారికి భూ పంపిణీ చేయాలన్నారు. కుటుంబానికి రెండు ఎకరాల భూ పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం ద్వారా కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించి, పెరిగిన ధరలకు అనుగునంగా రోజువారీ వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులు జి స్వాములు కార్యదర్శి ఎం నరసింహ నాయక్ సాయి కార్యదర్శులు పుల్లన్న, రాజు, ఉపాధ్యక్షులు జ్యోతి, కమిటీ సభ్యులు ధీనుడు బాల వెంకటయ్య, నరసయ్య ,నాగేంద్రబాబు, వెంకటేశ్వర నాయక్, నాగరాజు, సంజీవ 15 మందితో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు ఎం స్వాములు, డేవిడ్ మహిళా సంఘం శివమ్మ, పట్టణ పౌరుల సమైక్య నాయకులు సురేంద్ర, సిఐటియు రామ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

పకడ్బందీగా ఫ్యామిలీ డాక్టర్

అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలాజీ

ప్రజాశక్తి - జూపాడుబంగ్లా

ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని నంద్యాల జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలాజీ అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి కుష్టు నివారణ సర్వేపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పల్లెకు వైద్యాన్ని తీసుకొచ్చిందన్నారు. డాక్టర్లు రోగుల ఇంటి వద్దకే వెళ్లి సేవలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తాము నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువచేసేందుకు ఇంటి వద్దే వైద్యం(ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్) అందించేందుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తిస్తే సకాలంలో చికిత్స ద్వారా కోలుకునే అవకాశం ఉంటుందని గ్రహించి ఆ మేరకు చర్యలు చేపట్టడం విశేషమన్నారు. కుష్టు నివారణకు ఎల్‌సిడిసి సర్వే చేపట్టామని, ఒక్క లెప్రసీ కేసును కూడా వదలకుండా గుర్తించే కార్యక్రమం చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా టీడీ ఆఫీసర్ టి.మల్లికార్జునరెడ్డి, పీఎంవో విజయ్ కుమార్, డిప్యూటీ హెచ్ఈవో గంగాధార్, వైద్యాధికారి గంగాధర్, పర్యవేక్షకులు రాముడు, విజయలక్ష్మీ, సిబ్బంది పార్వతి, సరిత, పుష్పావతమ్మ, చెంచన్న, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి బాలాజి

పంట నష్టపరిహారం అందించాలి : బిసి

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

ఎస్ఆర్‌బిసి 7వ బ్లాకు పంట కాలువ తెగిపోవడంతో సుమారు 100 ఎకరాలు పైబడి పంటలు నీట మునిగిపోవడంతో ప్రభుత్వ అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి ప్రభుత్వం నుంచి వారికి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని వల్లంపాడు, చిన్నకొప్పెర్ల గ్రామాల్లో 7వ బ్లాక్ ఎస్ఆర్బిసి కాలువ తెగి నిటమునిగి నష్టపోయిన పంటపొలాలను బీసీ జనార్దన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్ఆర్‌బిసి కాలువ తెగడంతో నష్టపోయిన రైతులను రాజకీయాలకతీతంగా సర్వే చేసి వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం నాగేశ్వర్ రెడ్డి, అమడాల మద్దిలేటి, వల్లంపాడు నారాయణరెడ్డి, వల్లంపాడు జగదీశ్వర్ రెడ్డి, కలుగొట్ల గడ్డం నాగార్జున రెడ్డి,ఎంపీటీసీ సురేష్, గడ్డం అమర్నాథరెడ్డి, సోదర దీన్నే వెంకటసుబ్బారెడ్డి, రేవనూరు ఏవి సుబ్బారెడ్డి, పెనుగొండ రాజశేఖర్,బిజినవేముల జి హుస్సేనయ్య, డి హుస్సేనయ్య ,అన్వర్, గార్లపాటి హరినాద్ రెడ్డి, నాయకులు, పాల్గొన్నారు.

నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న బీసీ జనార్దన్ రెడ్డి

ఇస్మాయిల్ ఖాన్‌ను పరామర్శించిన బిసి రాజారెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ముత్తుమియా కాలనీకి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు ఇస్మాయిల్ ఖాన్‌ను పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజా రెడ్డి మంగళవారం పరామర్శించారు. వారం రోజుల కిందట ఇస్మాయిల్ ఖాన్ బైక్ పై నుండి కింద పడి వైద్యశాలలో చికిత్స చేయించుకొని ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న బిసి రాజారెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాయలసీమ సలాం, నరసింహారెడ్డి, కార్పెంటర్ షబ్బీర్, అబ్బాస్ అలీ పాల్గొన్నారు.

కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీకి జిల్లా నుండి ముగ్గురు ఎన్నిక

ప్రజాశక్తి - ఆత్మకూర్

కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడిగా పి సుధాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా డి సామన్న, మార్కులు నంద్యాల జిల్లా నుండి రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈనెల 21, 22 తేదీలలో చిలకలూరిపేటలో కౌలు రైతు సంఘం రాష్ట్ర మహాసభలు జరిగాయి. మహాసభలకు నంద్యాల జిల్లా నుండి భారీ సంఖ్యలో ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్ర కమిటీ ఎంపికైన నాయకులు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో కౌలు రైతుల సంఘం బలోపేతానికి కృషి చేస్తామని, జిల్లాలోని కౌలు రైతు సమస్యలపై పోరాటాలు చేసేందుకు రైతులను ఐక్య పరుస్తామని వారన్నారు.

వికలాంగుల పింఛన్ దరఖాస్తుల పరిశీలన

ప్రజాశక్తి - నందికొట్కూరు

మండల పరిధిలోని పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వికలాంగుల దరఖాస్తులను పరిశీలించినట్లు ఎంపీడీవో శోభ రాణి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ గ్రామంలో అర్హులైన వికలాంగులకు ప్రభుత్వం ఇచ్చిన సర్టిఫికెట్లు ఆధారంగా పెన్షన్ మంజూరు చేయుటకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో 36 మంది పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని అర్హులైన వారికి మంజూరు చేస్తామని తెలిపారు. **ఉయ్యాలవాడ :** మండలంలోని హరివరం, ఆర్ పంపలే గ్రామాలలో పిఓపిఆర్డి వెంకటేశ్వరరావు వికలాంగుల పింఛన్ల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, వాలంటీర్లు ఉన్నారు.

29న ఫసల్ బీమా నగదు జమ

నందికొట్కూరు : మండలంలోని ఆయా గ్రామాల రైతులకు ఈ నెల 29న ఫజల్ బీమా యోజన కింద సున్నా వడ్డీ అమౌంట్‌ను ప్రభుత్వం జమ చేయనున్నట్లు వ్యవసాయ బి శ్రావణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించిన రైతులకు ఈ పథకం వర్తిస్తుందని అన్నారు. గతంలో విడుదల చేసిన పంటల బీమా పథకంలో పెండింగ్‌లో ఉన్న రైతులకు అమౌంట్‌ను ప్రభుత్వం జమ చేయనున్నట్లు వెల్లడించారు.

హిందూ స్మశనవాటికను అభివృద్ధి చేయండి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్లలోని హిందూ స్మశనవాటికను అభివృద్ధి చేయాలని బిజెపి ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షులు శివకృష్ణ యాదవ్ అధికారులను కోరారు. మంగళవారం బిజెపి మండల అధ్యక్షుడు కోనేటి వేణు యాదవ్‌తో కలిసి ఆయన హిందూ స్మశనవాటికను సందర్శించారు. ప్రభుత్వ అధికారులు, అధికార పార్టీ ప్రతినిధులు తక్షణమే స్పందించి స్మశానాటికను పునరుద్ధరించాలని కోరారు.

విద్యార్థినీలను తీర్చిదిద్దాలి : ఎంఇఒ

అవుకు : పాఠశాలలోని ప్రతి విద్యార్థినితీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్ రావు అన్నారు. మంగళవారం మండలంలోని ఇస్రా నాయక్ తండా, మన్నే నాయక్ తండా ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి అర్థమయ్యే పద్ధతిలో విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు శ్రీరామచంద్రుడు, నరసింహ, శివరాంలు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల ఎక్స్‌పెండీచర్ బుక్ చేయండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రెండో దశ మనబడి నాడు-నేడు కింద చేపట్టిన నిర్మాణపు పనులకు ఎక్స్పెండిచర్ బుక్ చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ ఎంఇఒలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మనబడి నాడు-నేడు పనుల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మంజూరైన 959 పాఠశాలలు, 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇప్పటివరకు చేపట్టిన పనులకు ఎక్స్పెండిచర్ బుక్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శ్రీశైలం, బండి ఆత్మకూరు, నందికొట్కూర్, ఆత్మకూర్, సిరివెళ్ల, జూపాడుబంగ్లా తదితర మండలాల్లో నిధులు మంజూరైన చేపట్టిన పనులకు తక్కువ మొత్తంలో ఎక్స్పెండిచర్ బుక్ చేశారని, పెండింగ్లో ఉన్న పనులకు సంబంధించిన ఎక్స్పెండిచర్ ఈ వారంలో బుక్ చేయాలని సూచించారు. పాఠశాలల్లో నాడు నేడు కింద చేపట్టిన అదనపు తరగతి గదులు, టాయిలెట్లు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన పనులు ఆలస్యం లేకుండా నిర్దేశిత గడువులోపు పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకుండా ఉండటంతో పాటు ఇసుక, సిమెంట్, స్టీలు, ఇతర మెటీరియల్ కొరత లేకుండా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఎంఈఓలు తనిఖీ చేస్తూ పూర్తయిన పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు ఎక్స్పెండిచర్ బుక్ చేయించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధ, సెక్టోరల్ అధికారి, పంచాయతీరాజ్ ఎస్ఇ రామ్మోహన్, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న 10 గ్రామ వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో వాసుదేవ గుప్తా మంగళవారం తెలిపారు. ఈనెల 23వ తేదీన దరఖాస్తులు స్వీకరణ, 25న దరఖాస్తుల పరిశీలన, 26న ఇంటర్వ్యూలు నిర్వహించబడునన్నారు. 28వ తేదీన ఎన్నికైన అభ్యర్థులకు సమాచారం ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు.

పాములపాడు : మండలంలో 8 వాలంటరీ పోస్టులు ఖాళీగా ఉన్నా యని ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో నాగ శివ లీల పేర్కొన్నారు. పదో తరగతి అర్హత కలిగిన వారు సంబంధిత ధ్రువపత్రాలతో ఆన్లైన్లో 23, 24 తేదీలలో దరఖాస్తు చేసుకోవాల న్నారు. 25ను పరిశీలన, 28న ఇంటర్వ్యూలు జరుగుతాయన్నా రు. 29 ట్రైనింగ్, 30 తేదీన ఎంపికైన అభ్యర్థుల జాయిన్ ఉంటుందన్నారు. **రుద్రవరం :** మండలంలోని రుద్రవ రం ఆలమూరు, గ్రామాల్లో ఖాళీగా ఉన్న వాలంటరీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మధుసూదన రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడు తూ టెన్త్ అర్హత కలిగి ఉండి, 18 నుంచి 35 సంవత్సరాల లోపు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవా లన్నారు. **కొలిమిగుండ్ల :** మండలంలో వివిధ గ్రామా ల్లోని ఖాళీగా ఉన్న 4 వాలంటీర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సుబ్బరాజు తెలిపారు. మండలంలోని చింతలాయ పల్లి-1 (బిసి), బెలుం-1 (బిసి), బి.ఉప్పలూరు-1 (బిసి), అంకిరెడ్డి పల్లి-1 (ఒసి)లకు కేటాయించినట్లు తెలిపారు.

యాప్ లోన్లపై అవగాహన కల్పించండి : సిఐ

ప్రజాశక్తి - అవుకు

యాప్ లోన్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని బనగానపల్లె సిఐ సుబ్బరాయుడు గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు యాప్ లోన్లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిఐ సుబ్బరాయుడు, అవుకు ఎస్సై జగదీశ్వర్ రెడ్డిలు మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రజలను వివిధ రకాలుగా సైబర్ క్రైమ్ నేరగాళ్లు మోసం చేస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారని చెప్పారు. ఈ విషయంపై గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శులు ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. అన్ని సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** మహిళా పోలీసులు మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగే అసాంఘిక నేరాలపై దృష్టి కేంద్రీకరించాలని ఎస్ఐ రమేష్ రెడ్డి అన్నారు. మండలంలోని మహిళా పోలీసులతో పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ ప్రజలకు నిత్య అందుబాటులో ఉండటం, కేటాయించిన సచివాలయ పరిధిలో మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలపై తగిన దృష్టి సారించాలన్నారు. **గోస్పాడు :** గోస్పాడు పోలీస్ స్టేషన్లో గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శులకు లోన్ యాప్‌లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ కె.బి మల్లికార్జున మాట్లాడుతూ సైబర్ మోసగాళ్ల పట్ల ప్రజలకు ఇంటికి తిరిగి పూర్తిస్థాయిలో వారికి అవగాహన కల్పించే బాధ్యత మీదేనని తెలిపారు. సచివాలయం సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

68 మంది వాలంటీర్లకు మెమోలు

ఆత్మకూర్ : ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 68 మంది వార్డు వాలంటీర్లకు విధులు పట్ల నిర్లక్ష్య ధోరణి వ్యవహరించారని మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాసరావు మెమోలు జారీ చేశారు.

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం నాడు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పలు వార్డులలో సంచరించిన సందర్భంగా వార్డు వాలంటీర్లు హాజరు కాకపోవడంతో వారికి మెమోలు జారీ చేశారు. ఎమ్మెల్యే గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్న వార్డులకు సంబంధం లేని ఇతర వార్డు వాలంటీర్లకు కూడా మెమోలివ్వడం వాలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులతో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు కృష్ణవేణి, తదితరులు

ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో

విద్యార్థులకు భోజన ప్లేట్ల పంపిణీ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని అహోబిలం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో స్టీల్ భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు కృష్ణవేణి ప్రియ సుమారు పదివేల రూపాయల సొంత నిధులతో 150 మంది విద్యార్థులకు స్టీల్ భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ రామ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రామసుబ్రహ్మణ్యం, కృష్ణవేణి ప్రియకు ప్రధానోపా ధ్యాయులు వెంకటేశ్వర్లు,ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

కెవిపిఎస్ జిల్లా అధ్యక్షురాలుగా రంగమ్మ

నందికొట్కూరు : కెవిపిఎస్ జిల్లా అధ్యక్షురాలుగా కే రంగమ్మ ఎంపిక అయ్యినట్లు కెవిపిఎస్ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలుగా జి ఉషనమ్మ ఎంపికయ్యారని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికి గ్రామాలలో కుల వివక్షత కొనసాగుతుందని, వాటిని రూపుమాపేందుకు కెవిపిఎస్ కృషి చేస్తుందని తెలియజేశారు.

వీధిలైట్లు పంపిణీ

శిరివెళ్ల : మండల పరిధిలోని ఇసుక పల్లి గ్రామంలో ఎస్సి కాలనీ వాసులకు భూమా కిషోర్ రెడ్డి తన సొంత నిధులతో వీధి లైట్లు, ఎలక్ట్రికల్ వైర్‌లను హుస్సేన్ రెడ్డి, శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఇటీవలే జరిగిన పల్లేబాట కార్యక్రమంలో భాగంగా ఇసుకపల్లే గ్రామం ఎస్సి కాలనీలో ఎలక్ట్రికల్ వైర్, వీధి లైట్లు లేక చాలా ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు భూమా కిషోర్ రెడ్డికి తెలియజేయగా.. ఇచ్చిన మాట ప్రకారం వీధి లైట్లను అందజేరు.

వెండి నాగ పడిగ వితరణ

పాణ్యం : మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీ కొత్తూరు సుబ్బారాయడు స్వామి వారికి నంద్యాలకు చెందిన తిమ్మారెడ్డి, వెంకట సుబ్బమ్మ గార్ల కుమారుడు సుధాకర్ రెడ్డి 1 కేజీ 35 గ్రాముల వెండి నాగ పడిగను తన తండ్రి గారి పేరు మీద ఆలయ సిబ్బందికి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు నారయణ స్వామి శర్మ, సిబ్బంది సుబ్బారెడ్డి, దాతలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని బలపనురు, పాణ్యం ఉన్నత పాఠశాలలను డిఇఒ అనురాధ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. విద్యార్థుల హాజరును పరిశీలించి, డ్రాప్ ఔట్స్, తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం పిల్లల ప్రతిభ పాటవాలు పరీక్షించి, మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఈ కార్యక్రమం లో ఎంఈఓ కోటయ్య, ఎం.అర్.సి.లు శ్రీహరి, రాజశేఖర్ ప్రధాన ఉపాధ్యాయులు జిలానీ బాషా, నారయణ పాల్గొన్నారు.

పాములపాడు : ఎపి మోడల్ స్కూల్ నందు ఎంఈఓ బాలాజీ నాయక్ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్నారో లేదా అని ఆయన విజిట్ చేసినట్లు తెలిపారు. అన్ని పాఠశాలలలో నెల 21 నుండి కొత్త మెనూ ప్రకారం భోజనాన్ని అందించాల్సి ఉందన్నారు. మెనూ ప్రకారం అందించకుంటే చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు. కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు మరింత నాణ్యమైన పౌష్టికమైన ఆహారం అందుతుందని తెలిపారు. **శిరివెళ్ల :** మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఏపిఎం పుణ్యవతి మంగళవారం తనిఖీ చేశారు. శిరివెళ్ల మెయిన్, మోడల్ స్కూల్లో మిడ్ డే మీల్స్‌ను రుచి చూశారు. మెనూ ప్రకారం విద్యార్థిని విద్యార్థులకు వండి వడ్డించాలని సూచించారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఇఒ అనురాధ

జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకోవాలి : హౌసింగ్ డిఇ

ప్రజాశక్తి - ఆత్మకూరు

జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు మంజూరు అయిన లబ్ధిదారులు ఇళ్లు త్వరితగతిన నిర్మించుకోవాలని మండలంలోని కృష్ణాపురం గ్రామంలో నిర్మించుకుంటున్న జగనన్న కాలనీలను మంగళవారం నాడు హౌసింగ్ డిఇ, ఎంపీడీవో మోహన్ కుమార్ లేఔట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ప్రతి లబ్ధిదారు ఇంటికి వెళ్లి జగనన్న కాలనీలో పక్కా గృహాలు మంజూరైన వారు తమ ఇండ్ల నిర్మాణ పనులు చేపట్టాలని, అవసరమైన సిమెంటు, ఇసుక కడ్డీలను ప్రభుత్వం సరఫరా చేస్తుందని సూచించారు. పొదుపు మహిళలకు బ్యాంకుల ద్వారా గృహ నిర్మాణానికి లోన్ ఇప్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో నాగమ్మ, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** మండల కేంద్రమైన బండి ఆత్మకూరు గ్రామంలో ప్రభుత్వం కేటాయించిన జగనన్న కాలనీ పట్టదారులతో మంగళవారం లేఔట్ వద్దకు వెళ్లి ఎంపీడీవో హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఇంటి స్థలంతో పాటు పక్కా గృహం కేటాయించడం జరిగిందని, లబ్ధిదారుల త్వరితగతిన ఇళ్ల నిర్మించుకోవాలన్నారు,. లబ్ధిదారులకు కావలసిన సిమెంటు ఇసుక, స్టీలును ప్రభుత్వమే అందిస్తుందని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సుంకిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నటరాజ్, సర్వేర్లు ఇంజనీర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

లే అవుట్స్‌ను పరిశీలిస్తున్న డిఇ, ఎంపిడిఒ, తదితరులు

కార్మికులకు కనీస వసతులు కల్పించాలి

- గూడ్స్ షెడ్ నుంచి వచ్చే దుమ్ము, దూళి నుండి కాపాడాలి

- రైల్వే జిఎంకు సిఐటియు వినతి

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల రైల్వే స్టేషన్‌లో వ్యాగిన్లు వచ్చినప్పుడు వచ్చే దుమ్ము, దూళి నుండి కార్మికులను కాపాడాలని, కనీస మౌలిక వసతులు కల్పించాలని సిఐటియు నాయకులు రైల్వే జిఎంను కోరారు. మంగళవారం నంద్యాలకు వచ్చిన రైల్వే జిఎం అరుణ్ కుమార్ జైన్‌ను నంద్యాల రైల్వే గూడ్ షెడ్ ముఠా వర్కర్స్ హమాలీ యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, పట్టణ అధ్యక్ష ,కార్యదర్శులు లక్ష్మణ్ ,కే మహమ్మద్ గౌస్, యూనియన్ నాయకులు మాధవ, ఎల్లయ్య, అంజి, బంగారయ్యలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల రైల్వే స్టేషన్‌లో గూడ్ షెడ్ ముఠా హమాలీ వర్కర్స్ 140 మంది పని చేస్తున్నారనిచ, ఇక్కడ జరిగే పనుల వలనే కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ మధ్య కాలంలో ఇక్కడ వచ్చే గూడ్స్ వ్యాగిన్‌ల ద్వారా వచ్చిన వాటిని ఎత్తుటకు, దించుటకు పని చేసే సందర్భంలో వచ్చే లారీలు రాకపోకల వలన తీవ్రంగా దుమ్ము, ధూళి మొత్తం రైల్వేస్టేషన్ అంతా మంచులా కమ్ముకునిపోవడం, ఎదుటి మనిషి కూడా కనపడకుండా ఉండడం, ఒకరికొరు తగిలి చాలామంది కార్మికులు అనారోగ్యాల పాలై ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యను తీర్చేందుకు చర్యలు చేపట్టాలని, కార్మికులు భోజనాలు చేసేందుకు, తర్వాత విశ్రాంతి తీసుకునేందుకు వసతి కల్పించాలని కోరారు. తాగునీటి వసతి, బైక్ లేదా సైకిల్ స్టాండ్లను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రైల్వే జి ఎం కు వినతిపత్రం అందచేస్తున్న సిఐటియు, యూనియన్ నాయకులు

నంద్యాల-చెన్నైకు రెగ్యులర్ ట్రైన్ వేయాలని బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ విద్యార్థి, యువజన సంఘం వినతి

నంద్యాల అర్బన్ : నంద్యాల నుంచి చెన్నైకు అనేక మంది ప్రజలు, నిరుద్యోగులు ఉపాధి, ఉద్యోగాల కోసం నిరంతరం వెళు ‌_తున్నారని, వారిని దృష్టిలో ఉంచుకుని నంద్యాల నుంచి చెన్నైకి రెగ్యులర్ ట్రైన్ వేయాలని స్థానిక నంద్యాల రైల్వేస్టేషన్ తనిఖీకి వచ్చిన సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌కు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి, యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ రియాజ్ వినతిపత్రం అందజేశారు. జిల్లా నాయకులు దివాకర్, షేక్ చాంద్ బాషా, రఫీ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి రైలును కోవెలకుంట్లలో ఆపాలని రైల్వే జిఎంకు వినతి

కోవెలకుంట్ల : గుంటూరు-తిరుపతి ఎక్స్ప్రెస్ రైలును కోవెలకుంట్ల రైల్వేస్టేషన్లో ఆపాలని నంద్యాల రైల్వే స్టేషన్లో రైల్వే జిఎం అరుణ్ కుమార్ జైన్‌కు ప్రజా నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డితో కలిసి రైల్వే శాఖ జిఎంను కలిసి రైలును ఆపాలని విన్నవించామన్నారు. కుందూపోరాట సమితి కన్వీనర్ కామని వేణుగోపాల్ రెడ్డి , డాక్టర్ పేరా శ్రీధర్ రెడ్డి, గడ్డం అమర్నాథ్ రెడ్డి, శమీన్‌లు ఉన్నారు.